
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
1
ఆదివారం 15 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్లు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.4

ఎదురిల్లే.. ఊరే వేరు

- రెండు గ్రామాల మధ్యన సీసీ రోడ్డే సరిహద్దు
- నల్లా చార్జి ఒకరికి రూ.20, ఎదురింటి వారికి రూ.100

3

అప్పులపాలయ్యారు.. వలస పోయారు





పారా హుషార్

- తెల్ల జొన్నలకు పచ్చరంగు
- జోరుగా కల్తీ జొన్నల విక్రయాలు

కల్తీకి కాదేది అనర్హం చందంగా ప్రస్తుతం అన్నీ కల్తీమయమయ్యాయి. ఇటీవలి వరకు ప్యాకింగ్ గూడ్స్, వండిన ఆహార పదార్థాలు లక్ష్యంగా కల్తీ లేదా నాసిరకానికి పాల్పడగా, తాజాగా ముడి ధాన్యాన్ని సైతం కల్తీ చేస్తున్న పరిస్థితి ఉంది. గతంలో పేదల ఆహారంగా పేరొందగా, ఇటీవల శరీరంలో షుగర్, కొలస్ట్రాల్ నియంత్రణ పేరుతో అంతా పచ్చ జొన్నలు గణనీయంగా వినియోగిస్తున్నారు. రొట్టె, గట్కా తదితర రూపాల్లో పచ్చ జొన్నలు తీంటున్నారు. దీంతో పచ్చజొన్నల విక్రయాలు క్రమేపీ పెరుగుతూ ధరల్లో నాణ్యమైన సన్నబియ్యంతో పోటీపడుతున్నాయి. దీంతో ఇదే అదనుగా పచ్చ జొన్నల కల్తీ ముఠాలు విజృంభిస్తున్నాయి. మార్కెట్లో అంతగా డిమాండ్ లేని, ధరలోనూ దిగదిడుపుగా ఉండే తెల్ల జొన్నలకు రంగు వేసి పచ్చ జొన్నలుగా మార్చి బహిరంగా మార్కెట్‌లో అసలు ధరతో విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

గల్లీ కిరాణం దుకాణం మొదలు మార్కెట్‌లోని హోల్‌సేల్ దుకాణాలు వరకు అన్నింటిలో రంగు వేసిన పచ్చ జొన్నలే లభిస్తున్నాయి. దీంతో వినియోగదారులు పచ్చ జొన్నల పేరుతో రంగు వేసిన తెల్లజొన్నలు తింటూ ఆరోగ్యానికి మరింత చేటు చేసుకుంటున్నారు. వాస్తవానికి తెల్లజొన్నలు తింటే ఆశించిన స్థాయిలో ఆరోగ్య ప్రయోజనాలు సమకూరనప్పటికీ ఆకలి బాధ తీరుతుంది. కానీ, పచ్చ జొన్నలుగా మార్చేందుకు తెల్ల జొన్నలకు కలుపుతున్న రసాయనాలతోనే పలువురి ఆరోగ్యానికి నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. కల్తీ జొన్నల వ్యవహారం జిల్లా కేంద్రం భువనగిరితోపాటు సుమారు ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు.

సాయంత్రం జొన్న రొట్టె రెడీ

ఆరోగ్యానికి మేలు చేస్తుందని పెరిగిన విశ్వాసంతో షుగర్, గుండె తదితర జబ్బులు ఉన్నవారు, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందు జాగ్రత్తగా పచ్చ జొన్న ఆహారం తీసుకునేవారి సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా అన్ని ప్రాంతాల్లో జొన్న రొట్టెల విక్రయాలు సుమారుగా అన్ని పట్టణాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో సాయంత్రం కాగానే వీధులు, చౌరస్తాల్లో పెరిగాయి. దీంతో ఇంటిలో పచ్చ జొన్న ఆహారాన్ని వండలేని వారు రెడీమేడ్ జొన్న రొట్టె, గట్కా, జావ తదితర ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తూ కడుపు నింపుకుంటున్నారు. అయితే..

మిగతా 2వ పేజీలో...

ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మరిన్ని రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించింది. మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు 72 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సామగ్రి ఉండగా,మరో 142 వేదికలకు ఈ సదుపాయాన్ని కల్పించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



ప్రతీ రైతు వేదికలో
రైతు నేస్తం

- మరో 142 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం
- రైతులకు సలహాలు, సూచనలకు పెద్దపీట
- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మెళకువలు
- వ్యవసాయాన్ని పండుగ చేసేలా ప్రభుత్వ ప్రణాళిక

నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 32వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉండగా, తాజాగా మరో 62 రైతు వేదికల్లో సామగ్రి అందుబాటులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లాలో గతంలో 23 వేదికల్లో ఉండగా, ప్రస్తుతం 46 వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించారు. యాదాద్రి జిల్లాలో గతంలో 17 వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉండగా మరో 34 రైతు వేదికలకు పెంచడంతో రైతు నేస్తం కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయి. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతోపాటు వారికి వ్యవసాయంలో మెళకువలపై అవగాహన కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ నెలలోనే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా కూడా రైతుల ఖాతాలో జమ చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. అధికారులను పల్లెబాట పట్టించడంతోపాటు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలను నేరుగా వారికి తెలియజేసేందుకు రైతు వేదికలను వినియోగించుకోనుంది. వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని రానున్న రోజుల్లో మరిన్ని క్లస్టర్లకు పెంచే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలతో రైతులకు వ్యవసాయరంగంలో సాంకేతికతపై మరింత పరిజ్ఞానం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

పెరిగిన ప్రయోజనాలు..

రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రతీ వారం రైతులకు వివిధ పంటల సాగులో మెళకువలు ఇవ్వడం, శిక్షణ, అవగాహన కల్పించడం చేస్తున్నారు. అందుకు వ్యవసాయ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు బాధ్యతలు తీసుకుని వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు రైతు వేదికల్లో ఎల్‌సీడీ, వీడియో కెమెరాలు, సౌండ్ సిస్టం వంటి సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చారు. గతంలో నియోజవర్గానికి ఒక కేంద్రాన్ని ప్రారంభించగా, సత్ఫలితాలు వచ్చాయి. దీంతో మండలానికో వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఈ నేపథ్యంలో రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా, మరిన్ని రైతు వేదికలకు ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది. రాజేందర్‌నగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాలతో పాటు మిగతా వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో వివిధ పంటల సాగుపై రూపొందించిన వీడియోలను కూడా ప్రదర్శిస్తున్నారు. దీనికి తోడు శాస్త్రవేత్తలు వీడి యో కాన్ఫరెన్స్ సెంటర్‌ల ద్వారా ప్రతీ పంట సాగును, దానిలో యజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సవివరంగా చెబుతున్నారు. వీడియో కాన్ఫరెన్స్ సెంటర్లకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడటంతో పాటు వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు ఏర్పాటుచేయగా, ప్రభుత్వం మండలాలకు వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి ప్రస్తుతం..

మిగతా 2వ పేజీలో...

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ నెల 16న నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మరిన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని ప్రారంభిస్తున్నాం. మండలస్థాయిలో అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ, మండల విద్యాధికారులు అందుబాటులో ఉండాలి. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు కావాలి. సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలి. పంటలలో ఆధునిక మెళకువలు, నూతన సాంకేతిక విధానాలపై శాస్త్రవేత్తలు, అధికారులు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను రైతు వేదికల ద్వారా తెలియజేయడం జరుగుతుంది. రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు పెద్ద సంఖ్యలో వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

- ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్

జాతీయ లోక్‌అదాలత్‌కు విశేషస్పందన



లోక్‌అదాలత్‌లో రాజీపత్రాన్ని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేషస్పందన లభించింది. లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 12 బెంచిలు ఏర్పాటు చేయగా 38 సివిల్ కేసులు, 15,837 క్రిమినల్, 85 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 28 బ్యాంక్ కేసులు, 25 సైబర్ క్రైమ్ కేసులు, 30 ట్రాన్స్‌కో, 5,567 ట్రాఫిక్ చలానా కేసులు, మొత్తం 21,660 కేసులు పరిష్కరించారు. ప్రమాద బీమా కేసుల్లో రూ.4,75,29,000 నష్టపరిహారం ఇప్పించగా, బ్యాంక్ కేసుల్లో రూ.30,21112 రుణ పరిహారం ఇప్పించారు. అదేవిదంగా సైబర్ క్రైమ్ కేసుల్లో రికవరీ డబ్బు రూ.2,03,112 బాధితులకు ఇప్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పి.పురుషోత్తంరావు, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కట్ట అనంతరెడ్డి, మంద నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హోటళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండటౌన్,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల వెంట ఉన్న హోటళ్లు,దాబాలు, రెస్టారెంట్ల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడమేగాక, హైవేలపై హోటళ్లు, దాబాలు వద్ద ప్రమాదాలు జరగకుండా నివారణా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా హోటళ్ల వద్ద వాహనాలు నిలిపే, బయల్దేరే సమయంలో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు సరైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హోటళ్ల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పోయే వాహనదారుల వివరాలు తీసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ప్రతీ రోజు అందజేయాలన్నారు. మద్యం, గంజాయి విక్రయించడం, వినియోగించడం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా ఇతర ప్రాంతాల నుంచి మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకొచ్చి వినియోగిస్తుంటే సమీప పోలీస్‌స్టేషన్‌కుగానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ఎస్‌బీ సీఐ రాము, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు సరికాదు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు గతంలో ఒకసారి కేటీఆర్‌ను సుదీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయారని అన్నారు. ఫార్ములా ఈ-రేస్ సజావుగా సాగిందని, అందులో ఎలాంటి అక్రమాలు లేకున్నా కేటీఆర్‌ను విచారించడం సరైన విధానంకాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నేతలపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు అన్నారు. శనివారం బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో మిగతా రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొని బీసీలు రాజకీయ పార్టీ స్థాపించి రాజ్యాధికారంలోకి రావాలని, రాజ్యాధికారమే నిజమైన ఆత్మగౌరవమని అన్నారు. బీహార్‌లో యాదవులు, కురుమలు రాజకీయ పార్టీలు స్థాపించారని, తమిళనాడులో డీఎంకె, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ స్థాపించి రాజ్యాధికారం సాధించాయని తెలిపారు. తమిళనాడులో బీసీలు పరిపాలిస్తుండటం వల్లే ఆ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తప్ప బీసీలు అన్నిచోట్ల అధికారంలో కొనసాగుతున్నారన్నారు. పశ్చిమబెంగాల్‌లో బ్రాహ్మణుల పరిపాలన వల్లే ఆ రాష్ట్రం ఇప్పటివరకు అభివృద్ధి సాధించలేదన్నారు. అగ్రకులాలు చేసే ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ, బీసీల ఆత్మాభిమాన ఉద్యమంలో మాత్రం వెనకబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక జనాభా ఉన్న బీసీల నుంచి తక్కువ శాతం ఎమ్మెల్యేలు ఎన్నికవుతున్నారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే బీసీలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు. రిటైర్డ్ పీఎస్ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, బీసీలు రాజకీయ పరిజ్ఞానం పెంచుకొని రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ, బీసీలు ఉద్యమ చైతన్యంతో పోరాటాలు విస్తృతం చేయాలన్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యుడు పాలకూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్, చామకూర రాజు, కేవీ.గౌడ్, చెన్నా శ్రీకాంత్, కొండల్ గౌడ్ అవ్వరు వేణు, తరాల పరమేష్ యాదవ్, సమీర్‌కుమార్, నకరికంటి కాశయ్య, పందుల సైదులు, రామరాజు, శంకర్‌గౌడ్,మల్లయ్య ముదిరాజ్, కృష్ణ కౌండిన్య, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకూ పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నల్లగొండ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డికొమరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, వారి లాభాల కోసమే ప్రభుత్వరంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తోందని ఆరోపించారు. బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఇవి అమలైతే కార్మికులు బానిసలుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె మోదీ ప్రభుత్వానికి గుణపాఠం అవుతుందని హెచ్చరించారు. సమ్మె విజయవంతానికి జిల్లాలో ఈ నెల 15 నుంచి 20 వరకు యూనియన్ సమావేశాలు నిర్వహించి అధికారులకు సమ్మె నోటీసులు అందజేయాలన్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశాలు నిర్వహించి కార్మికుల్లో సమ్మె స్ఫూర్తిని నింపాలన్నారు. జూలై మొదటి వారంలో సమ్మె జయప్రదం చేయాలని కరపత్రాల పంపిణీ, బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. జూలై 9న ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు డబ్బికారు మల్లేష్, ప్రమీల, ఎండి.సలీం, అవుత సైదులు, దండెంపల్లి సత్తయ్య, గౌతమ్‌రెడ్డి, చింతపల్లి బయన్న, తదితరులు పాల్గొన్నారు.

21న యోగా దినోత్సవం



యోగా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ కల్చరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21వ ఉదయం 9గంటలకు స్థానిక ఎంవీఆర్ స్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్టు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, యోగా ఉత్సవ సమితి అధ్యక్షుడు నాగులపల్లి శ్యాంసుందర్, కార్యదర్శి జల్లెల్లి వెంకటేశ్ యాదవ్ తెలిపారు. శనివారం యోగా దినోత్సవం కరపత్రాన్ని జిల్లా న్యాయాధికారి ఎం.నాగరాజు ఆవిష్కరించారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు, యువకులు, విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువులు కరుణాకర్, పున్న వెంకటేశ్వర్లు, కోట్ల సైదులు, డీఎస్పీ శివరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

21న జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన!



నల్లగొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 21న నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నట్టు సమాచారం. నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి(సాగర్) మండలంలో భూభారతి అమలు తీరును పరిశీలించడంతోపాటు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్న ట్టు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన పర్యటన, కార్యక్రమాలు అధికారికంగా ఖరారుకానున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాం గం ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న నేపథ్యంలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ ప్రజలకు, రైతులకు చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి భూభారతి అమలు తీరును పరిశీలించనున్నట్టు సమాచారం.

సూర్యాపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్

నియామకమెప్పుడో?

- నెల రోజులు దాటినా నియమించని అధికారులు
- ఇన్‌చార్జి సీఐతో నెట్టుకొస్తున్న వైనం
- రెగ్యులర్ ఇన్‌స్పెక్టర్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నిత్యం వేల మంది వివిధవర్గాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. అంతేకాక విజయవాడ- హైదరాబాద్ నగరాలకు మధ్యన ఈ పట్టణం ఉంది. దీంతో పాటు నిత్యం వీఐపీల రాకపోకలు సాగుతుంటాయి. అంతేకాకుండా వివిధ సమస్యలకు సంబంధించి రోజు ఇరవై నుంచి నలభై ఫిర్యాదులు వస్తుంటాయి. అలాంటి సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్ లేక నెల రోజులు దాటింది. ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి ఇన్‌చార్జి సీఐతో పోలీస్ ఉన్నతాధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. అదే డీఎస్పీ విషయంలో మాత్రం వెంటనే నిర్ణయం తీసుకుని ప్రసన్న కుమార్‌ను డీఎస్పీగా నియామకం చేశారు. ఇన్‌స్పెక్టర్ విషయంలో మాత్రం నిర్ణయం ఆలస్యమవుతోంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

సూర్యాపేట పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లేక నెల రోజులు దాటింది. సూర్యాపేట పట్టణంలో విద్యార్హత లేకుండా ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తుండడంతో సూర్యాపేట ఐఎంఏ ప్రతినిధుల ఫిర్యాదుతో పలు ప్రైవేట్ ఆస్పత్రులపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు.

ఈ విషయంలో ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ వైద్యుడి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేసిన విషయంలో మే 11వ తేదీన ఏసీబీ అధికారులు సూర్యాపేట డీఎస్పీతో పాటు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్‌లపై కేసులు నమోదుచేశారు. అయితే సూర్యాపేట డీఎస్పీగా ప్రసన్నకుమార్‌ను వెంటనే నియమించిన అధికారులు అప్పటి నుంచి నేటి వరకు సూర్యాపేట పట్టణానికి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇన్‌చార్జి సీఐతో నెట్టుకొస్తున్న అధికారులు

సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో అధికారులు ప్రస్తుతానికి సూర్యాపేట రూరల్ సీఐకు ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగించారు. సూర్యాపేట రూరల్ సీఐ తన పరిధితో పాటు సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు భార్యాభర్తల వివాదాలు, ఇతర ఘర్షణలు, చోరీలు, వీఐపీల బందోబస్తులు, ఇంకా వివిధరకాల సమస్యలకు సంబంధించి 20 నుంచి 40 వరకు ఫిర్యాదులు వస్తుంటాయి. ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో వారి ఫిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐలు ఉన్నా వారి స్థాయికి మించిన ఫిర్యాదులు వస్తుండడంతో అలాంటి వాటి విషయంలో ఎస్‌ఐలు నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నియామకం ఆలస్యం కావడంలో మతలబు ఏంటీ?

సూర్యాపేట పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు చాలా మంది అధికారులు పోటీ పడుతుంటారు. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ పోస్టు కోసం కొంతమంది పోలీస్ అధికారులు రూ.లక్షల్లో కూడా డబ్బులు ముట్టచెప్పేందుకు సిద్ధంగా ఉంటారు. నెల రోజులు దాటినా నేటికి ఇన్‌స్పెక్టర్‌ను నియమించకపోవడంలోని మతలబు ఏంటోనని ప్రజలు ఆలోచన చేస్తున్నారు. సూర్యాపేట పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ధీటైన ఇన్‌స్పెక్టర్ పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి రాక నియామకం చేయడం లేదా లేక ఏమైనా రాజకీయ కారణాలతో ఆలస్యం చేస్తున్నారా అనే విషయాలు తెలియడం లేదు. సాధారణంగా ఎక్కడైనా ఒక పోలీస్ అధికారి బదిలీ అయినా, సస్పెండ్ అయినప్పటికీ రెండు నుంచి వారం రోజుల్లో వెంటనే కొత్త అధికారిని నియమిస్తారు. కానీ సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ విషయంలో మాత్రం ఎందుకు ఆలస్యం అవుతుందో అర్థం కానీ పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు.

పాతవారికే పట్టం

- కొత్తటెండర్లకు అవకాశం ఇవ్వని అధికారులు
- వివిధ సాకులతో రద్దు
- తిరిగి నిర్వహణ బాధ్యతలు పాతవారికే
- టెండర్‌దారులతో అధికారుల కుమ్మక్కు



యాదగిరిగుట్ట క్షేత్రంలో అధికారులు, టెండరుదారులు ఒక్కటయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల్లోని లొసుగులను ఆసరా చేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎక్కువైనా పర్వాలేదని టెండర్ దక్కించుకుని ఆ తర్వాత వ్యాపారంలో నష్టం వచ్చిందని, అంత చెల్లించలేమంటూ టెండర్లను రద్దు చేసుకుంటున్నారు. వారిస్థానంలో కొత్త వారు రాకుండా నిబంధనల లొసులుగులతో అధికారులు వారికి సహకరిస్తున్నారు. పాతటెండర్‌దారుడికే దుకాణాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తూ భక్తుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. అధికారుల అండదండలు ఉండటంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

ఏడాది కాల వ్యవధికి (2022 నుంచి 2023 వరకు) సురక్ష ఏజెన్సీకి టెండర్ ద్వారా సుమారు 400 పైచిలుకు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించుకునేందుకు అవకాశం దక్కింది. 2023-24 వరకు సరైన పోటీదారులు లేక అదే ఏజెన్సీకి రెన్యూవల్ చేశారు. తిరిగి 2025 సంవత్సరం సింగిల్ టెండర్ వచ్చిందనే సాకుతో టెండర్ ప్రక్రియనే రద్దు చేసి సురక్ష ఏజెన్సీకే నిర్వాహణ బాధ్యతలు అప్పగించారు. అయితే ఇటీవల గ్లోబల్ ఏజెన్సీ ద్వారా సింగిల్ టెండర్‌కే కేటాయింపు చేయబోతున్నట్లు తెలుస్తోంది. 2024-25 వరకు కొండ కింద సత్యదేవుడి వ్రత మండపాల వద్ద పూలు, పండ్లు విక్రయాలకు అనుమతి ముగిసింది. తిరిగి టెండర్లు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు టెండర్‌లో పాల్గొన్నారు. సరైన వేలం పాట రాలేదని ఆ టెండరును కూడా రద్దు చేశారు. గత వేలం పాట ఆధారంగా ప్రతి నెలా అద్దె ప్రాతిపదికన పాత టెండర్‌దారుడికే విక్రయాల బాధ్యతలు అప్పగించారు.

కాగా, దేవాదాయ శాఖ ఆదేశాలతో ప్రతి ఏడు ఈ ప్రోక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తారు. టెండర్ దక్కించుకున్న టెండరుదారుడు దేవస్థానం నిర్ణయించిన వాయిదాలు చెల్లించకపోతే అధికారులు చర్యలు తీసుకునే వీలుంటుంది. కానీ, చర్యలు తీసుకోక అందుకు భిన్నంగా లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం. వ్యాపారంలో నష్టం వాటిల్లిందని వ్యాపారుల విన్నపాలకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. పైగా వ్యాపారి అభిప్రాయాలను దేవాదాయ శాఖకు పంపిన ఫైళ్లను తోడు చేస్తూ అధికారులు చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. గత వేలం పాట ఆధారంగా ప్రతి నెలా అద్దె వసూలుతో దుకాణాల నిర్వహణ పాత వారికే అప్పగించే ప్రక్రియలో తిరిగి టెండర్ నిర్వహించే వరకూ అధికారులు జేబులు నింపుకుంటూ వారికి సహకరిస్తున్నారు.

మరికొన్ని దుకాణాలకు సంబంధించి అధికారులు రెన్యూవల్ చేస్తుంటారు. ఈ ప్రక్రియలో కూడా భారీగా చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. గడువు ముగిసినప్పటికీ టెండర్ నిర్వహించకుండా 33.5శాతం రెన్యూవల్ చేస్తూ కొత్త వారికి అవకాశం రాకుండా పరోక్షంగా కొత్త వ్యక్తులు టెండర్‌లో పాల్గొనకుండా అడ్డుపడుతున్నారు. కొండకింద సెంట్రల్ పార్కింగ్ రింగ్ రోడ్డు వద్ద బొమ్మల దుకాణం, వాహనాల పూజల (ప్రకటించిన టెండరును రద్దు చేశారు) సామాగ్రి, వైకుంఠద్వారం వద్ద కొబ్బరికాయల దుకాణాలు మాత్రం ఎందుకు రెన్యూవల్ చేశారన్నది చెప్పడం లేదు. లాభాపేక్షతో కాలాయాపన చేస్తూ (కావాల్సినంత సమయం ఇస్తూ) వ్యాపారులు దుకాణం సొంతం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అధికారులు సహకరిస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీ పుష్కరిణి చెంత కొబ్బరికాయల దుకాణం రద్దు చేసినా, టెండరు నిర్వహించేందుకు కుంటిసాకులు చూపిస్తున్నారు. అధికారులు కుమ్మక్కు కావడంతో ఎన్ని అవకతవకలు జరిగినా తమ రాజకీయ పలుకుబడితో దుకాణాలు శాశ్వతం చేసుకునేందుకు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కాగా, టెండర్లు వాయిదా పడిన కారణంతో దేవస్థానమే తలనీలాల సేకరణ, సెంట్రల్ పార్కింగ్ నిర్వహణ నేరుగా నిర్వహించి దుకాణాలను మాత్రం పాత వారికే అప్పగించారు. దీనిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, వేలం పాటలో దుకాణం దక్కినా కొన్నిరోజుల తర్వాత వ్యాపారంలో నష్టం పేరుతో దేవస్థానం ఆదాయానికి గండి కొట్టే ఎత్తుగడలు వ్యాపారులు వేస్తున్నారు.

తోటి టెండరుదారులను కూడా తప్పుద్రోవ పట్టించి తిరిగి టెండరు నిర్వహించేటప్పుడు పాత వారు నష్టం వాదనే లేవనెత్తుతున్నారు. దీనికి నిబంధనల్లోని లొసుగుల ఆధారంగా తరుచూ టెండర్లను రద్దు చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా ఇరువర్గాలు లబ్ధిపొందుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వారం లోపు టెండర్లు నిర్వహిస్తాం



అధికారులపై ఆరోపణలు అవాస్తవం. ఎలాంటి అవకతవకలు తావులేకుండా టెండర్ల నిర్వహణ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. దేవాదాయ కమిషనర్ అనుమతితో దేవస్థాన పరిధిలో సుమారు 15నుంచి 20టెండర్లు నిర్వహించాల్సి ఉంది. గతం కంటే వేలం పాట తక్కువగా రావడంతో టెండర్లు రద్దు చేశాం. తిరిగి నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నాం. టెండర్లు రద్దయిన చోట సిబ్బంది కొరత వల్ల దేవస్థానం నిర్వహణ చేయలేకపోతుంది. టెండర్ల నిర్వహణ ప్రక్రియ వారం లోపు చేపడతాం.

- దోర్బల భాస్కరశర్మ (ఉప కార్యనిర్వాహణ అధికారి, యాదగిరిగుట్ట దేవస్థానం)

చెరువులో పడి పశువుల కాపరి మృతి



మైసయ్య(ఫైల్)

కోదాడ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని దోరకుంటలో చెరువులో పడి పశువుల కాపరి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాతరాజు మైసయ్య(52) శనివారం రోజు మాదిరే గేదెలు తీసుకుని గ్రామశివారు చెరువు వద్దకు వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో గేదెలకు నీళ్ల తాపించగా, అనంతరం గేదెలను చెరువు నుంచి బయటికి వెళ్లగొట్టేందుకు చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మైసయ్యకు భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రేన్ ఢీకొని మహిళ...

సూర్యాపేట క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చింతలచెర్వు వద్ద శనివారం క్రేన్ ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్ఐ ఈట సైదులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చింతలచెర్వుకు చెందిన కలకోట్ల వెంకటమ్మ(68) పనినిమిత్తం చింతలచెర్వులో ఉండే తన కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అక్కడి నుంచి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వ్యవసాయ మార్కెట్ వైపు నుంచి ఖమ్మం రోడ్డు వైపునకు వెళ్తున్న క్రేన్ వెంకటమ్మను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆమె కింద పడగానే క్రేన్ ఆమె పైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు కుమార్తె వల్దాసు పుష్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ఈట సైదులు తెలిపారు.

డివైడర్‌ను ఢీ కొన్న బైక్, ఇద్దరికి గాయాలు

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో బైక్ అదుపు తప్పి డివైడర్ ఢీకొని తండ్రికుమారులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పీఏపల్లి మండలం ఎర్రగుంటతండాకు చెందిన రమావత్ రాము, అతడి కుమారుడు కలిసి బైక్‌పై మిర్యాలగూడకు బయలుదేరారు. రంగారెడ్డిగూడెం వాటర్‌ప్లాంట్ వద్ద రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమదంలో ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గుడిపల్లి పోలీసులు తెలిపారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత

ఐదుగురు నిందితులు అరెస్టు, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పెన్‌పహాడ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఐదుగురు వ్యక్తుల నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 9గంటల సమయంలో అనంతారం క్రాస్‌రోడ్డు వద్ద పెన్‌పహాడ్ ఎస్ఐ గోపికృష్ణ తన పోలీస్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నాడు. ఐదు బైకులపై ఐదుగురు అతివేగంగా అనుమానాస్పదంగా దురాజ్‌పల్లి వైపు వెళ్తున్నారు. ఎస్ఐ గోపికృష్ణ తన పోలీస్ సిబ్బందితో వారిని వెంటాడి చాలా చాకచక్యంతో పట్టుకున్నారు. దొరికిన వారు పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మకంటి గోపి, పేరం శ్రీకాంత్, పేరం శివ, పెన్‌పహాడ్‌కు చెందిన ఇంద్రవెల్లి జీవన్‌కుమార్, నారాయణగూడెం గ్రామానికి చెందిన పర్సనబోయిన రమేష్‌లుగా గుర్తించారు. ప్రతి వ్యక్తి దగ్గర 100గ్రాముల గంజాయి లభించింది. వెంటనే వారిని అరెస్టు చేసి 500గ్రాముల గంజాయిని ఐదు బైకులను, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని విచారించారు. బొమ్మకంటి గోపి, పేరం శ్రీకాంత్‌లు కొన్నినెలల నుంచి ఒడిశా రాష్ట్రానికి వెళ్లగా అక్కడి కొందరు గంజాయి విక్రయిస్తుండటంతో తీసుకుని వచ్చి దాచుకున్నాడు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. పెన్‌పహాడ్ ఎస్ఐ గోపికృష్ణను పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రసన్నకుమార్ అభినందించారు. కార్యక్రమంలో సూర్యాపేటరూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ, పోలీస్ కానిస్టేబుల్స్ ప్రవీణ్, మహేష్, వంశీ, సైదులు, రమేష్, లింగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో సహాయకుడు బలవన్మరణం



గంధమల్ల రవి(ఫైల్ ఫొటో)

యాదగిరిగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నివాసంలో పని చేస్తున్న సహాయకుడు (వంట మనిషి) శనివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం ప్రభుత్వ విప్ అయిలయ్య స్వగ్రామమైన సైదాపురం గ్రామానికి చెందిన గంధమల్ల రవి రెండేళ్లుగా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఇంట్లో సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే నివాసంలోని మూడో అంతస్తులోనే భార్య నవిత, ఇద్దరు కుమార్తెలు భవ్యశ్రీ, వర్షితతో కలిసి ఉంటున్నాడు. కాగా, శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో క్యాంప్ ఆఫీస్ సిబ్బందికి భోజనం సిద్ధం చేయాలని అతడు భార్యకు చెప్పి డాబాపైకి వెళ్లాడు. రాత్రి 10 గంటలు అవుతున్నా అతడు ఇంట్లోకి రాకపోవడంతో రవి భార్య పెద్ద కుమార్తెతో కలిసి డాబాపైకి వెళ్లి చూడగా టెర్రస్‌పై వేసిన రేకులకు బిగించిన పైపునకు చున్నీతో ఉరి వేసుకుని కిందికి వేలాడుతూ కనిపించాడు. ఆందోళన చెందిన నవిత భయంతో కింద ఉన్న క్యాంపు కార్యాలయంలోని ఎమ్మెల్యే సిబ్బంది బలరాం, శ్రీకాంత్‌కు విషయం చెప్పింది. వారు పరుగులు పెడుతూ డాబాపైకి వెళ్లి అదే రాత్రి రవి మెడలోంచి చున్నీ తొలగించి హుటాహుటిన భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

అప్పుల బాధతోనే ఆత్మహత్య

అప్పుల బాధతో మనస్తాపం చెంది అతిగా మద్యం తాగి తన భర్త రవి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి భార్య నవిత యాదగిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్వగ్రామంలో నూతన ఇంటి నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం రూ.6లక్షల ప్రైవేట్ బ్యాంకు నుంచి (మార్టిగేజ్) రుణం పొందాడని తెలిపింది. నెల వాయిదాలు సక్రమంగా చెల్లించకపోయే సరికి ఇంటికి తాళం వేస్తానని బెదిరింపులు రావడంతో పరువు పోతుందని మనోవేదనకు గురయ్యాడని పేర్కొంది. అవమాన భారాన్ని తట్టుకోలేక అతిగా మద్యం సేవించిన తన భర్త శుక్రవారం రాత్రి నాలుగో అంతస్తులోని టెర్రస్‌పైకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు యాదగిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియలు నిమిత్తం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. జిల్లా కేంద్రం ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఓదార్చారు.

రవి ఆత్మహత్యపై సోషల్ మీడియాలో వైరల్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నివాసంలో రవి ఆత్మహత్య చేసుకోవడం శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రెండు రోజులుగా స్వగ్రామంలో ఉండి ఎమ్మెల్యే ఇంటికి వచ్చిన రవి అనుమానాస్పదంగా ఉరివేసుకొని మృతి చెందడం అనుమానాలకు తావిస్తోందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ఐ

నేరేడుగొమ్ము, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పరివాహక ప్రాంతమైన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీలో మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోటేష్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో బోట్లలో ప్రయాణించడానికి అనుమతులు లేవన్నారు. విహారయాత్రకు వచ్చి కృష్ణానదిలో మునిగి మృత్యువాతకు గురవుతున్నారని ఆయన తెలిపారు. పర్యాటకులు అనుమతులు లేకుండా కృష్ణానదిలో వెళ్లవద్దన్నారు. నదీ పరివాహక ప్రాంతంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. పార్టీల పేరిట మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. అదేవిధంగా ఇసుక, రేషన్ బియ్యం అక్రమరవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మానాన్న నేను చనిపోతున్నా..

● కాపాడిన ఫోన్‌కాల్



జస్విత నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విషం తీసుకున్న కుమార్తె తల్లిదండ్రులకు ఫోన్ చేసింది.. నేను చనిపోతున్నానంటీ.. అంతే తల్లిడిల్లిన ఆ పేగుబంధం పోలీస్‌స్టేషన్ తలుపు తట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకున్న పోలీసులు వెంటనే దాని ద్వారా ఆ కుమార్తె ఉన్న ప్రాంతాన్ని కనుగొని ప్రాణాలను దక్కించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద శనివారం జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన జస్విత(28) భర్తతో పాటు అత్తామామల వరకట్న వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని చనిపోవాలని నిర్ణయించుకుంది. ఇందుకు గాను సొంత కారులో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి సాగర్‌కు చేరుకుంది. సాగర్ పైలాన్‌కాలనీ జెన్‌కో కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద కారును నిలిపివేసి వెంట తెచ్చుకున్న విషం తాగింది. కొద్ది సేపటి తర్వాత తల్లిదండ్రులకు ఫోన్ చేసి సాగర్‌లో తాను చనిపోతున్నానని తెలిపింది. వెంటనే జస్విత తండ్రి సూర్య కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు వెంటనే తెలికపర్చాడు. వారు సాగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంపత్ తన సిబ్బందితో సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ సిగ్నల్స్‌ను కనుక్కుని జస్విత వద్దకు చేరుకున్నారు. అక్కడ కారులో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను చికిత్సనిమిత్తం స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధిత మహిళ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు సాగర్ ఆసుపత్రికి చేరుకుని కుమార్తెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. సకాలంలో స్పందించి తన కుమార్తె ప్రాణాలను కాపాడిన సాగర్ పోలీసులకు జస్విత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ భవనం నుంచి పడిన విద్యార్థి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి

సూర్యాపేట క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో ప్రైవేట్ మహిళా హాస్టల్ భవనం పైనుంచి పడటంతో యువతికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల జ్యోతి పాలిటెక్నిక్ విద్యనభ్యసించింది. అందులో పలు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్ ఉండడంతో సూర్యాపేటలో ఉండి సంబంధిత సబ్జెక్టులు చదువుకోవాలని భావించింది. అందులో భాగంగా వారం కిందట సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 అడుగుల రోడ్డు వద్ద గల నక్షత్ర మహిళా ప్రైవేట్ హాస్టల్‌లో చేరింది. కాగా, శనివారం మధ్యాహ్నా సమయంలో హాస్టల్ భవనం మొదటి అంతస్తు వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఒక్కసారిగా భవనం పైనుంచి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హాస్టల్ నిర్వాహకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వం జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ ఈట సైదులు హాస్టల్‌కు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా హాస్టల్ భవనంలోని మొదటి అంతస్తులో ఏర్పాటుచేసిన సీసీటీవీ ఫుటేజీని సేకరించారు. విద్యార్థిని ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయిందా? లేక కావాలనే కిందకు దూకిందా? అనే విషయాలు తెలియాల్సి ఉంది.

ప్రతీ రైతు వేదికలో 'రైతు నేస్తం'

(1వ పేజీ తరువాయి)

క్లస్టర్లకు విస్తరిస్తోంది.

రైతుల సంక్షేమం, అభివృద్ధిపై..

ఆధునిక పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికత ద్వారా పంటల సాగు తదితర అంశాలను శాస్త్రవేత్తలు రైతులకు ఎప్పటికప్పుడూ వివరించనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈనెల 16న జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి నేరుగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశాన్ని ఇవ్వనున్నారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా గతంలోని 72 రైతు వేదికలతో పాటు ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసిన 142 వేదికల్లో కార్యక్రమాన్ని వీక్షించనున్నారు. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంతో పాటు అవసరమైన పబ్లిక్‌అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తారు. 16న మధ్యాహ్నం 3గంటలకు రైతువేదికల పరిధిలోని రైతులను సమీకరిస్తారు. ఒక్కో రైతువేదికలో 250మంది వరకు రైతులు ఉండేలా వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆ రోజు ప్రతీ రైతువేదికలో పండుగ వాతావరణం ఉండేలా మామిడి తోరణాలు, కొబ్బరి ఆకులు, పూలతో అలంకరిస్తారు. ఆయా రైతువేదికల్లో రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున్న ఏర్పాట్లల్లో లోపాలు లేకుండా వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది. ప్రతీ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పారా హుషార్

(1వ పేజీ తరువాయి)

కొనుగోలు సమయంలో పచ్చ, తెల్ల జొన్నలతో చేసినవా? అని తెలుసుకొని కొనుగోలు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

ఇలా గుర్తుపట్టవచ్చు

మార్కెట్లో కొనుగోలు చేసిన జొన్నలను పలువురు దుమ్మును మాత్రమే శుభ్రం చేసి పిండిగా పట్టించి రొట్టె తదితర రూపాల్లో భుజిస్తుంటారు. దీంతో అసలు, కల్తీ తెలియని పరిస్థితి. కానీ, కొనుగోలు చేసిన జొన్నలను నీటితో కడిగితే అసలు రంగు తెలుస్తుంది.అసలు పచ్చ జొన్నలైతే నీటితో కడిగితే శుభ్రమై పచ్చగానే ఉంటాయి. కానీ, కల్తీ జొన్నలు మాత్రం రంగు వెలసి తెల్లగా అవ్వడంతో పాటు కడిగిన నీరంతా పచ్చగా మారుతుంది. దీంతో జొన్నలను కొనుగోలు చేసే దుకాణంలోనే గ్లాసుడు నీళ్లలో పిడికెడు జొన్నలు వేసి కడిగి పచ్చ జొన్నలుగా నిర్ధారించుకున్నాకే కొనుగోలు చేయడం మంచిదని పలువురు పేర్కొంటున్నారు.

పచ్చ జొన్నల్లో పోషకాలు ఇలా..

పచ్చ జొన్నలతో శరీరానికి బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలోని కార్బోహైడ్రేట్లు శక్తిని అందిస్తాయి. ప్రోటీన్లు శరీర నిర్మాణానికి దోహదపడతాయి. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకాన్ని నివారిస్తుంది. బీ-1 విటమిన్ నాడీవ్యవస్థకు విటమిన్ బీ-9తో గర్భిణులకు ఫోలేట్ లభిస్తుంది. విటమిన్-సీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాంటీఆక్సిడెంట్లు కణజాలానికి రక్షణగా సహాయపడతాయి.

ఆరోగ్య ప్రయోజనాలు

పచ్చజొన్నలు గుండె, కన్ను ఆరోగ్యాన్ని, శక్తిని మెరుగుపరుస్తాయి. బీపీ నియంత్రణకు, అధిక కొలస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

జొన్నల రంగు మారిస్తే కఠిన చర్యలు

జొన్నల రంగు మారిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని ప్రమాదకర రసాయనాలతో తెల్లజొన్నలను పచ్చ జొన్నలుగా రంగు మార్చి విక్రయించే వ్యాపారులపై కేసు నమోదు చేస్తాం. కల్తీ జొన్నల విక్రయాలపై వినియోగదారులు సమాచారం ఇవ్వాలి. అయితే కొనుగోలు సమయంలోనే జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. కల్తీ జొన్నల నియంత్రణకు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం.బి

డాక్టర్ సుమన్ కళ్యాణ్, యాదాద్రి జిల్లా ఆహారభద్రత డెజిగ్నేషన్ అధికారి

అప్పులపాలయ్యారు..
వలస పోయారు

● దయనీయంగా ప్రథమ పౌరుల పరిస్థితి



తిరుమలగిరి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఊరికి ఏదో చేద్దామని ప్రజాప్రతినిధులయ్యారు. అంతో ఇంతో గ్రామాభివృద్ధి చేశారు. కానీ చేసిన అప్పులు తీర్చలేక వలస వెళ్లారు. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో 16 గ్రామపంచాయతీలున్నాయి. ఇందులో చాలా వరకు సర్పంచ్‌గా పోటీ చేసిన అభ్యర్థులు అప్పులు చేసి మరీ ఖర్చు చేశారు. అప్పు చేసి గ్రామాలను అభివృద్ధి చేసినా ప్రభుత్వపరంగా రావాల్సిన బిల్లులు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు రాకపోవడంతో ఆందోళన చెందారు. మండలంలోని ఇద్దరు మాజీ సర్పంచులు ఈ అప్పులు తీర్చలేక వలస బాట పట్టారు. మిగతా వారు బిల్లులు ఎప్పుడొస్తాయో? అని ఎదురు చూసుకుంటూ అప్పు ఇచ్చిన వారికి భయపడుతూ కాలం వెల్లదీస్తున్నారు. నెల క్రితం సర్పంచులకు పెండింగ్ బిల్లులు మంజూరైనట్లు వార్తలు చూసి సంతోషపడి ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ఇప్పటి వరకు బిల్లులు పడలేదనే సమాచారంతో డీలా పడిపోయారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచులు కోరుతున్నారు.

సుమారు రూ.10 లక్షలు రావాలి



రూ.10లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్లు, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి కొనుగోలు చేసిన స్థలం, మోటార్లు బాగుచేసినవి, శ్మశాన వాటిక, పల్లెప్రకృతి వనంకు సంబంధించిన బిల్లులు రావాలి. పదవీ కాలం ముగిసి 16 నెలలు గడిచినా బిల్లులు రాకపోవడంతో అప్పులు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.

దేవానాయక్, మర్రికుంటతండ, గ్రామ మాజీ సర్పంచ్.

అప్పులు తెచ్చి మరీ..



గ్రామాభివృద్ధికోసం అప్పులు తెచ్చి సుమారు రూ.7లక్షలతో శ్మశాన వాటిక, మెగా పార్క్ తదితర పనులు చేశాను. ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడంతో అప్పులపాలై గ్రామాన్ని వదిలి వలస వెళ్లి బతకాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

బెడిద కర్ణాకర్, మామిడాల, మాజీ సర్పంచ్.

ఎదురిల్లే.. ఊరే వేరు

● రెండు గ్రామాల మధ్య సీసీ రోడ్డే సరిహద్దు ● నల్లా చార్జి ఒకరికి రూ.20, ఎదురింటి వారికి రూ.100



ఈ సీసీ రోడ్డుకు ఇరువైపులా రెండు గ్రామాలు

భువనగిరి రూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): ఇళ్లు ఎదురెదురుగానే ఉన్నా.. ఊరు మాత్రం ఒకటి కాదు. కుటుంబాలు పక్క పక్కనే ఉంటున్నా గ్రామాలు వేర్వేరే. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి శివారులోని పగిడిపల్లి, బీబీనగర్ మండలం గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని గూడూరు జంట గ్రామాలుగా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. పగిడిపల్లి, గూడూరు రెండు గ్రామాలను ఎదురెదురుగా ఉన్న ఇళ్ల మధ్యలోని సీసీరోడ్డు వేరు చేస్తుంది. అయినప్పటికీ రెండు గ్రామాల ప్రజలు ఐక్యతను చాటుకుంటున్నారు. భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామం 2017లో భువనగిరి మునిసిపాలిటీలో విలీనమైంది. భువనగిరి మునిసిపాలిటీలో విలీనమైన పగిడిపల్లి గ్రామస్థులు రెవెన్యూ సేవల కోసం భువనగిరి తహసీల్దార్ కార్యాలయానికి, శాంతి భద్రతల సమస్యలు ఉంటే భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అదేవిధంగా గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతుంది. అయితే ఏమైన గొడవలు, జరిగిన మదిర గూడూరుకు చెందిన గ్రామస్థులు బీబీనగర్ పోలీస్ స్టేషన్‌కు, రెవెన్యూ తదితర సమస్యల కోసం బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఎదురెదురుగా ఇళ్లలో నివసిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు రెండు మండలాల పరిధిలో కొనసాగుతుండడం వింత అనుభూతిని కలిగిస్తుంది. అయితే ఎదురెదురుగా ఇళ్లు ఉన్నప్పటికీ మునిసిపల్ పరిధిలో ఉన్న పగిడిపల్లివాసులు ప్రతీనెల నీటి కులాయి చార్జి రూ.100 చెల్లిస్తుండడం, ఆస్తి, ఇళ్ల నిర్మాణాల అనుమతి తదితర పన్నుల ఆర్థిక భారం పడుతుంది. గూడూరు గ్రామానికి చెందిన వారు నెలకు రూ.20మాత్రమే నీటి కులాయి బిల్లును గ్రామపంచాయతీకి చెల్లిస్తుండడం, అనుమతులు నామమాత్రంగానే ఉంటున్నాయి. చెత్త సేకరణ, నీటి సరఫరా తదితర సమస్యలు తలెత్తినప్పుడు మునిసిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది తికమకపడుతున్నారు. అయినప్పటి కీ వారికి గ్రామాల ప్రజలు సమాచారమిస్తూ సమస్యను పరిష్కరించుకుంటున్నారు.

కొత్త వారికి వింత

పగిడిపల్లి, గూడూరు ఊర్లకు మధ్యన సీసీరోడ్డు (రహదారి) మాత్రమే ఉంది. ఎదురెదురుగా ఉన్న ఇళ్లను చూసి అది వేరే ఊరు అనగానే కొత్తగా వచ్చిన వారు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

పన్నుల భారంతో ఇబ్బంది పడుతున్నాం



పగిడిపల్లి గ్రామంలో 2017లో గ్రామాన్ని భువనగిరి మునిసిపాలిటీలో విలీనంచేశారు. కాగా అప్పటినుంచి ఎలాంటి అభివృద్ధి జరగకపోగా గ్రామీణ వాతారవణంలోనే మేము కొనసాగుతున్నాం. ప్రతీ నీటి కులాయికి రూ.100 చెల్లిస్తున్నాం. మా ఇంటి ఎదుటి వారు రూ.20 చెల్లిస్తున్నారు.

రంగ లావణ్య, పగిడిపల్లి, భువనగిరి మండలం .

ఐక్యతతో పండుగలు జరుపుకుంటున్నాం



గూడూరు, పగిడిపల్లి గ్రామాల్లో ఏ గ్రామంలో పండుగ అయినా రెండు గ్రామాల ప్రజలు కలిసే జరుపుకుంటున్నారు. గూడూరు, పగిడిపల్లిని విలీనంచేసి ఒకే గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి. చెత్తా చెదారం సేకరణ, డ్రైనేజీ సమస్య పరిష్కారంలో రెండు గ్రామాల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సి ఉంది.

పగడాల భాగ్యమ్మ, గూడూరు బీబీనగర్‌మండలం .

స్వచ్ఛ మిర్యాలగూడ
నినాదంతో పనిచేయాలి

● పురపాలకులకు సూచనలిచ్చిన ఎమ్మెల్యే బత్తుల

మిర్యాలగూడ టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛ మిర్యాలగూడ నినాదంతో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పురపాలకులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో పట్టణం అపరిశుభ్రంగా మారిందన్నారు.

ఖాకీ చొక్కా తొడిగి, ఆటో నడిపి..



చెత్త సేకరణ ఆటో నడుపుతున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కార్మికుడి అవతారంలో మిర్యాలగూడ పట్టణంలో శనివారం పర్యటించారు. పారిశుధ్య కార్మికులతో సమావేశమైన ఎమ్మెల్యే ఖాకీ చొక్కా ధరించి, కాలినడక పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్, గణేష్ మార్కెట్‌లలో పర్యటించారు. అనంతరం చెత్త తరలించే ట్రాలీ ఆటోను స్వయంగా గాంధీనగర్ వరకూ నడుపుతూ చెత్త సేకరించారు. చెత్త వేసేందుకు వచ్చే మహిళలను పలకరిస్తూ తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య వ్యవస్థను మెరుగు పరిచేందుకు నేను సైతమంటూ పట్టణ ప్రజలందరూ ముందుకు రావాలని కోరారు. ఆయనవెంట మునిసిపల్ ఇంజినీర్ వెంకన్న, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, కొమ్ము శ్రీను తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రాహుల్ గాంధీ సూచన మేరకు జిల్లాలోని అన్ని మండల కమిటీలు బూత్ కమిటీలు నూతనంగా వేసి పార్టీని పటిష్ఠం చేయాలన్నారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పని చేయాలన్నారు. అనంతరం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని బీజేపీ చూస్తుందని, ఇది సరైన విధానం కాదన్నారు. డీఈవో కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప సుందర్, ప్రధాన కార్యదర్శి నాగమణి రెడ్డి, కార్యదర్శి జాను, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, జానకి, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరాజ్యలక్ష్మీ, సూరెడ్డి సరస్వతి, కార్యదర్శి పోలేపల్లి రుద్రమ్మ, లలిత జ్యోతి, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, స్వరూపారెడ్డి, రాధ, పద్మ, శ్యామల, సువర్ణ పాల్గొన్నారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నృసింహుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు నిర్వహించారు. స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. అలాగే అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య కల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు సాయంత్రం అలంకార వెండీజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు.

బారులు తీరిన భక్తులు

రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్టదైవాలను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఉభయ క్యూలైన్లు రద్దీగా మారాయి. ధర్మదర్శనం భక్తులకు రెండు గంటలు, ప్రత్యేక దర్శన భక్తులకు గంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. ఉభయ దర్శన క్యూలైన్లతోపాటు బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలు, చంటిపిల్లల తల్లులు, వృద్ధులు ఇబ్బందులుపడ్డారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.49,88,217 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

భక్తిభావం పెంపొందించేందుకు..

స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం అందజేయడం భక్తిభావం పెంపొందించేందుకేనని ఈవో వెంకట్రావు తెలిపారు. కొండపైన పశ్చిమ రాజగోపురం వద్ద ఆయన ఉచిత ప్రసాద వితరణ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, ఏఈవో గజ్వెల్లి రమేష్‌బాబు, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామారావు, పర్యవేక్షకుడు దాసోజు నరేష్, ఎస్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ కే. శేషగిరిరావు, పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో శనివారం రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహుని నిత్యకల్యాణం వైభవంగా కొనసాగింది. కల్యాణ మూర్తులను పరిణయ వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణ తంతు కమనీయంగా నిర్వహించారు.

రక్తదానం అభినందనీయం



అవార్డు స్వీకరిస్తున్న దివీస్ పరిశ్రమ లైజాన్ ఆఫీసర్ కిషోర్‌కుమార్ చౌదరి

చౌటుప్పల్ టౌన్, నల్లగొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడంలో దివీస్ పరిశ్రమ ఉద్యోగులు అగ్రభాగాన ఉండడం అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దివీస్ పరిశ్రమకు రాష్ట్ర ఉత్తమ రక్తదాన అవార్డు- 2025ను గవర్నర్ అందజేశారు. దివీస్ పరిశ్రమ లైజాన్ ఆఫీసర్ బి. కిషోర్‌కుమార్ చౌదరి అవార్డు స్వీకరించారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని గవర్నర్ సూచించారు. పది సంవత్సరాలుగా దివీస్ పరిశ్రమ ఉద్యోగులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎక్కువగా బ్లడ్ యూనిట్స్ ను అందించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు నటరాజ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, దివీస్ పరిశ్రమకు ఉత్తమ రక్తదాన అవార్డు రావడం పట్ల జీఎం పి. సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

'పద్మ' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన పద్మ పురస్కారాలకు అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాసులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు భారతదేశంలో అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటని తెలిపారు. ఈ పురస్కారాలను ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తారని తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమలు మొదలైన రంగాలలో విశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి అవార్డులు ఇస్తారని తెలిపారు. జాతి, వృత్తి, లింగ బేధం లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులని, 2026 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు, సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ ద్వారా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్లను ఈ నెల 31వ లోగా పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌లో, గరిష్ఠంగా 800 పదాలకు మించకుండా వివరణాత్మక కథనం రూపంలో పంపించాలని తెలిపారు

● నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల చర్లపల్లిలో 2025- 26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన మహిళా విద్యార్థులు జూన్ 23 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

నీట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ

నీట్ 2025 ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంచి ర్యాంకులు సాధించి ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రగతి కళాశాల విద్యార్థుల ప్రతిభ



నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ 2025 ఫలితాల్లో పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలకు చెందిన కే. ఉజ్వల 501 మార్కులు, కె. ఇందు 428, ఎం. ఆశ్రిత 427, ఎం. షైనీ 407, హారీబా తబసుం 385, నబీహా మెహీన్ 375 మార్కులు సాధించి కళాశాలను అగ్రస్థానంలో నిలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను, తల్లిదండ్రులను కళాశాల ఛైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్ ఎ. నరేందర్ బాబు, ఎన్.శశిధర్ రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్ రెడ్డిలు అభినందనలు తెలిపారు.

జాస్రిత అకాడమీ విద్యార్థుల ప్రతిభ



నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ 2025 ఫలితాల్లో జాస్రిత అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. అకాడమీకి చెందిన విద్యార్థులు ఆఫియా సదాఫ్ 429, ఫహద్ 416, రుమాన్ 412, వర్షిత 410, మారియ్ 410, సిరి 403, హర్షియా తబసుమ్ 401, పల్లవి 381, అక్షర 380, దానియా 380, పరియా మెకవిష్ 377, బృంద 371, అనన్య శరణ్ 360, రేష్మ 348, హిబ అన్వర్ 347, ఐయన్ 345, దీక్షత 344, హేమదుర్గ 335, అక్షిత్ 331, ఇర్ఫాన్ తబసుమ్ 330 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. అకాడమీ యాజమాన్యం ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు.

ఆటో డ్రైవర్ కూతురికి 100వ ర్యాంకు

నల్లగొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ఆటో డ్రైవర్ కూతురు సత్తా చాటింది. ఆల్ ఇండియాలో 100వ ర్యాంకును సాధించి ప్రతిభ చాటింది. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన బచ్చు చంద్రయ్య, శారద దంపతుల కూతురు బచ్చు ప్రియాంక నల్లగొండ పట్టణం సమీపంలోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ విద్య అభ్యసించింది. ప్రియాంక ఆల్ ఇండియాలో 100వ ర్యాంకు సాధించడం పట్ల నల్లగొండ ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. పోటీ పరీక్షల్లో ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. నల్లగొండ బ్రాంచీలో నీట్ చదివిన 11మంది మెడికల్ సీటు సాధించారు. 100వ ర్యాంకు సాధించిన ప్రియాంకతో పాటు మరో 10మంది నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈవో సురేందర్ రెడ్డి, నల్లగొండ బ్రాంచీ జోనల్ అసిస్టెంట్ సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ మనోజ్‌రెడ్డి, డీన్ కిషోర్ బాబు, ఏవో సరితారెడ్డి, అధ్యాపకులు వరదన్, ప్రసన్న, శ్రీనివాస్, శోభ అభినందించారు.




ఎస్ఆర్ కళాశాల ఎదుట విద్యార్థుల సంబరాలు

గౌతమి విద్యార్థుల ప్రభంజనం



నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో గౌతమి కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాలకు చెందిన ఎండీ. ఉజైర్‌కు 519 మార్కులు, సిరందాసు పావని 472, యాస్మిన్ 467మార్కులు, పసుపులేటి లేఖన 428, శైలా అలిఖాన్ 397మార్కులు, మలియా తస్నీమ్ 385 మార్కులు, హీబా షైరుఖ్ 347 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం కాసర్ల వెంకట్ రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమిడి రఘుపాల్ రెడ్డి, పుట్టా వెంకటరమణారెడ్డిలు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జోసా మొదటి రౌండ్ కౌన్సిలింగ్‌లో గౌతమి జూనియర్ కళాశాలకు చెందిన ఆర్. శ్రీకర్‌కు ఐఐటీ దన్‌బాద్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో, జి. తేజస్వినికి ఐఐటీ కాంచీపురంలో ఈసీఈ, ఎం.శివాజీకి ఎన్ఐటీ అగర్తలాలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమిడి రఘుపాల్ రెడ్డి, పుట్టా వెంకటరమణారెడ్డి అభినందించారు.



● కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌తండాకు చెందిన సపావత్ సుందర్‌నాయక్, లక్ష్మి దంపతుల కుమార్తె సపావత్ సోనియా నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 768వ ర్యాంక్ సాధించింది. 720 మార్కులకు గాను 466 మార్కులు సాధించి 95.56 శాతంతో ఎస్టీ కేటగిరిలో నీట్ ర్యాంక్ సాధించింది.

● సూర్యాపేటఅర్బన్: సూర్యాపేటలోని కాకతీయ హైస్కూల్ పూర్వ విద్యార్థి జాన్వేష్ ఆల్ ఇండియా 20వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ గుండా హరినా రాయణ, ప్రిన్సిపాల్ గాలి రమేష్ తెలిపారు.

మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం సమీపంలో గల మహిళా సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల చర్లపల్లిలో 2025-26 విద్యాసంవత్సరంలో డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలు ఈ నెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీఆర్‌డీవో ఎస్సీ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ పవిత్ర పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి బస్‌డిపోకు పూర్వ వైభవం తేవాలి

నార్కట్‌పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి బస్‌డిపోకు పూర్వ వైభవం తేవాలని బీజేపీ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో సుమారు 80 బస్సులు 400 మంది సిబ్బందితో ఎప్పుడూ సందడిగా ఉండే డిపోతో నార్కట్‌పల్లి ప్రాంతం కూడా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం బస్టాండ్‌లో కనీస వసతులు కూడా కొరవడ్డాయని, మహిళల టాయ్‌లెట్ బ్లాక్‌కు డోర్లు చెడిపోయాయని విమర్శించారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు

మర్రిగూడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాలు కొనుగోలు మోసపోవద్దని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగం గౌడ్ అన్నారు. శనివారం స్థానికంగా మాట్లాడుతూ ట్యాగ్ ఉన్న బస్తాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. విత్తన బస్తాపై, ప్యాకెట్లపై గడువు తేదీ, రకం పేరు, లాట్ నంబర్లు చూసుకోవాలన్నారు. కొనుగోలు బిల్లుతో పాటు విత్తన రకం, గడువు తేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రశీదు తీసుకోవాలన్నారు. విత్తన కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డీలర్లు చెప్పే ఆఫర్లు, మాయ మాటలను నమ్మి మోసపోవద్దని విత్తనాలు పెట్టిన తరువాత కూడా రశీదులు, ఖాళీ ప్యాకెట్లు భద్రపర్చుకోవాలన్నారు.

బొడ్రాయి, గ్రామదేవతలకు పూజలు



గోపలాయపల్లిలో శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో బొడ్రాయి, ముత్యాలమ్మ, మారెమ్మ, కోటమైసమ్మ, కనగంటి మైసమ్మ, పోతురాజు ఆలయాల తృతీయ వార్షికోత్సవ పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు గుండెపూడి జానకి రామశర్మ, సహార్చకులు ఉత్తరాపల్లి నర్సింహాచార్యులు, భీష్మాచార్యుల యాజ్ఞీకంలో గణపతి పూజ, నవగ్రహ మండప పూజ, పుణ్యాహవాచనం, సర్వతోభద్ర మండలి పూజ, శాంతి హోమం నిర్వహించారు. ఈ ఉత్సవంలో మాజీ సర్పంచ్ గోసుల భద్రాచలం, యాట సైదులు, గాలి నర్సింహ్మా, దేశగాని స్వామి, నర్ర నర్సిరెడ్డి, దేశగాని కృష్ణయ్య, కామసాని శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, గాలి ఆంజనేయులు, దేశగాని వెంకన్న, రాచకొండ భాస్కర్, రాములు, జనార్దన్ గోపాల్ పాల్గొన్నారు.

పెండింగ్ పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



జన్మదినం సందర్భంగా పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, పెన్షనర్లు పెండింగ్ పీఆర్‌సీని, ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్ల సంఘం నల్లగొండ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో పెన్షనర్ల భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం కేవలం ఒక్క డీఏ ఇచ్చి చేతులు దులుపుకుందని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఐదు డీఏలకు విడుదల చేయాలని, పెన్షనర్లను 1 జనవరి 2026కు ముందు రిటైర్డ్ అయిన పెన్షనర్లకు రాయితీలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయన్నారు. అనంతరం 42 మంది పెన్షనర్ల జన్మదినం సందర్భంగా ఘనంగా నిర్వహించి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు జెల్లా శ్రీశైలం, రంగయ్య, ఆంజనేయులు, సుధాకర్, పుల్లయ్య, రమేష్, హుస్సేన్, బాలరాజు, బిక్షం, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు సహకరించాలి



కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ శివతేజ, సిబ్బంది

కేతేపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మికుల విముక్తికి అందరూ సహకరించాలని కేతేపల్లి ఎస్ఐ ఎ.శివతేజ కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు అశ్విత స్వచ్ఛంద సంస్థ చేపట్టిన అవగాహన పోస్టర్‌ను ఆయన శనివారం కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల భవిష్యత్‌లో పిల్లలు ఎదుర్కొనే సమస్యలు వివరిస్తూ గ్రామీణులు బాల్య వివాహాలు జరపకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్న సమాచారం ఇస్తే వివాహం నిలపడంతో పాటు పెళ్లి జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.కవిత, పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, ఎం.నర్సయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న అబ్బగోని రమేష్

రామగిరి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ అన్నారు. మొదటి విడతలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ ఇళ్లు లేని వారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో 47వ వార్డు ఆఫీసర్ రష్మి, వార్డు నాయకులు మునసా ప్రసన్న, వీరారెడ్డి, పంతులు శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, నవీన్, ప్రదీప్, రాజు, వినయ్, లతీఫ్, జానీ, నజీర్, సూర్య, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో కట్టంగూరు విద్యార్థినికిర్యాంకు

కట్టంగూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):నీట్ ఫలితాలల్లో కట్టంగూరుకు చెందిన బి.జాహ్నవి ఆల్ ఇండియా లెవల్‌లో 65105 ర్యాంకు సాధించింది. 720మార్కులకు గాను 489మార్కులు సాధించింది. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించింది. ఈ సందర్భంగా నీట్‌లో ర్యాంకు సాధించడం పట్ల వివిధ పార్టీల నాయకులు, బంధువులు అభినందించారు.

అరకొరగా తాగునీరు

▸▸ గ్రామాల్లో పైపులైన్‌లో కంట్రోలర్లు తొలగిస్తున్న వైనం ▸▸ ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ▸▸ పట్టించుకోని అధికారులు



మిషన్‌భగీరథ నీరు రాకపోవడంతో పైపులైన్ తవ్విన గ్రామస్థులు

(ఆంధ్రజ్యోతి-తిప్పర్తి): గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ నీటిని సరఫరా చేయడానికి మిషన్ భగీరథ పథకం అమలు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో సిబ్బంది సరిగ్గా అమలుచేయక పోవడంతో కొన్ని గ్రామాల్లో నీటిసరఫరా జరగడం లేదు. మండలంలోని మామిడాల, సర్వారం, పజ్జూరు వంటి గ్రామాల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

కార్యదర్శుల నిర్లక్ష్యంతోనే ..

ఇంటింటికీ తాగునీటి పథకంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్‌లు ఇచ్చి, గ్రామంలోని ప్రధాన నీటి ట్యాంకుకు నీరు అందేలా ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం వారు చూస్తారు. గ్రామంలో ప్రతి ఇంటికీ సరైనా విధంగా తాగునీరు అందేలా పంచాయతీ కార్యదర్శిలు చూడాలి. కానీ తమకు ఎన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని చెప్పినా వారు పట్టించుకోవడం లేదని నీరు అందని కుటుంబాలు చెబుతున్నారు. పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ ఒకే విధానంలో నల్లా కనెక్షన్లు ఇచ్చారు. కానీ కొందరు గ్రామస్థులు నల్లా పైపులోని కంట్రోల్‌ను తీయడం వల్ల రంధ్రం పెద్దగా అయి ఎత్తు తక్కువగా ఉన్న ప్రదేశానికే నీరు ఎక్కువగా చేరుతుంది. అందుకు తాగునీరు రాని నివాస ప్రజలు అందరికీ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వారం గ్రామంలో మొత్తం 580కి పైగా కనెక్షన్లు ఇండగా 50 ఇళ్లకు పైగా నీరు రావడం లేదు. మరో 20 ఇళ్లకు పూర్తి స్థాయిలో నీరు రావడం లేదని గ్రామస్థులు తెలిపారు.

పట్టించుకోవడం లేదు



ఎన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గతేడాది కాలంగా ప్రతి రోజు పక్కన కాలనీ నుంచి బిందెతో నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తుంది. దయచేసి మా ఇం టికి తాగునీరు అందేలా చూడాలి.


- గంట మంజుల, సర్వారం గ్రామ మహిళ

నోటీసులు అందజేస్తాం

గ్రామంలో కొందరు వ్యక్తులు మిషన్ భగీరథ నీరువచ్చే పైపులైన్‌కు ఉన్న కంట్రోలర్ తీసి వేయడంలో తాగునీటి సమస్య ఏర్పడుతోంది. కంట్రోలర్ తీసివేసిన వారికి నోటీసులు అందజేసి అందరికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం

- కే. వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో

వేణుగోపాల స్వామి విగ్రహానికి స్వర్ణ కిరీటం



నార్కట్‌పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలోని వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహానికి స్వర్ణ కిరీటాన్ని చేయించారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యుల సహకారం భక్తులు అందించిన విరాళాలతో సుమారు 31 తులాల బంగారాన్ని వినియోగించి స్వామి వారికి నెమలి ఫించంతో కూడిన స్వర్ణ కిరీటాన్ని హైదరాబాద్‌లో చూడ ముచ్చటగా తయారు చేయించారు. కెంపులు, పచ్చలు వంటివి కిరీటాన్ని మరింత ఆకర్షణగా చేశాయి. ఆలయంలో నిర్వహించే ఏదైనా ఉత్సవ కార్యక్రమం సందర్భంగా స్వామివారికి కిరీట ధారణ చేస్తామని మోహన్‌రెడ్డి తెలిపారు.

రక్తదానం అలవాటుగా మారాలి



రక్తదాతలను సన్మానిస్తున్న కిమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జిలు

నార్కట్‌పల్లి, మర్రిగూడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడాన్ని ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని నార్కట్‌పల్లిలోని కామినేని వైద్య విద్యా కళాశాల ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ హెచ్‌వోడీ డాక్టర్ దివ్య ప్రఫుల్లా అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆపద్బాంధవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా కామినేని ఆసుపత్రికి రక్తదానం చేస్తున్న సుమారు 50 మంది రక్తదాతలను శనివారం స్థానిక ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయవచ్చని చెప్పారు. రక్తం అవసరమైన రోగులకు ఆపద్బాంధవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా కామినేని ఆసుపత్రికి అవసరమైన అన్ని వేళల్లో రక్తదానం చేస్తున్న రక్తదాతల దాతృత్వాన్ని సేవలకు గుర్తుగా రక్తదాతలను సన్మానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆపద్బాంధవ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్‌గౌడ్, కామినేని బ్లడ్ బ్యాంకు హెచ్‌వోడీ డాక్టర్ దివ్య ప్రఫుల్లా, పవన్‌కుమార్, స్వాతి బ్లడ్ బ్యాంకు సిబ్బంది గౌతమ్‌కుమార్, సైదులు, అనితలతో పాటు రక్తదాతలు గణేశ్, స్వప్న, శ్రీకాంత్, సాయి, అరుణ్, హరికృష్ణ, శివరాం, చందు, గణేశ్, నరేందర్, శివకృష్ణ, అశోక్, నరేశ్, భాను పాల్గొన్నారు.

● మర్రిగూడ : రక్తదానం చేసినట్లయితే మరి కొంతమంది ప్రాణాలు కాపాడిన వారవుతామని సంగం బ్లడ్ బ్యాంక్ ఎల్బీనగర్ మేనేజింగ్ డైరెక్టర్ గిరి యాదయ్య అన్నారు. శనివారం మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రెసిడెంట్ క్లబ్ మెంబర్ నీల భాస్కర్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ సంగం బ్లడ్ బ్యాంక్ ఆవరణలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కృష్ణ, శివ, స్టార్ హెల్త్‌క్లబ్ మెంబర్ శివశంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసయాదవ్



శ్రీనివాసయాదవ్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీహరి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమారం గ్రామానికి చెందిన కంపసాటి శ్రీనివాసయాదవ్ కేతేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికయ్యారు. రెండేళ్ల క్రితం జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఆయన పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపికై కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశంలో కేతేపల్లి మండల అధ్యక్షుడి నియామకం చేశారు. ఆ పదవిలో కొనసాగుతున్న కంపసాటి శ్రీనివాసయాదవ్‌ను మరోమారు కొనసాగించేందుకు పార్టీ నాయకులు సముఖత వ్యక్తం చేయడంతో ఆయన నియామకాన్ని మంత్రి సమక్షంలోనే ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ప్రకటించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాసయాదవ్‌ను మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అధిక స్థానాల్లో గెలిపించేందుకు తోడ్పడతానన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కట్టంగూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి, తమలో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకరావాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరులో శనివారం ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల ద్వారా స్నేహ భావం పెంపొందుతుందని, దేహదారుఢ్యం మెరుగవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభ ఇలాంటి పోటీల ద్వారానే వెలుగులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహా, మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండు పరమేష్, నాయకులు మిట్టపల్లి శివశంకర్, మర్రి రాజు, గద్దపాటి దానయ్య, అంజయ్య, బుర్రి శేఖర్, ఎరకల శశి, అయితగోని సైదులు, ముక్కమాల శేఖర్, అనిల్ రెడ్డి, సాయి, శ్రీను, విజయ్, సాయి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



చెరుకు లక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటుతున్న అధికారులు

కట్టంగూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని ఉద్యానవన శాఖ ప్రాంతీయ అధికారి శ్వేత అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామంలోని చెరుకు లక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం ప్రారంభించారు. ఆయిల్ పామ్ అధిక దిగుబడి ఇస్తుందని మార్కెట్‌కు సంబంధం లేకుండా కంపెనీ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఒక ఎకరం వరిసాగు నీటితో మూడు ఎకరాల ఆయిల్‌పామ్‌ను సాగు చేయవచ్చు అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్, మొక్కలకు రాయితీ సౌకర్యాలను వినియోగించుకుని పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ఒక ఎకరం ఆయిల్‌పామ్ సాగు చేస్తే రూ.1లక్ష25వేలు రైతు ఆదాయం పొందవచ్చు అన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద మొక్కకు రూ.20ల చొప్పున ఎకరానికి 57మొక్కలను అందిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి కంపెనీనీ హాలియా సమీపంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పతాంజలి గూడ్స్ లిమిటెడ్ నల్లగొండ జిల్లా మేనేజర్ నర్రా రవీందర్ రెడ్డి, చిట్యాల డివిజన్ మేనేజర్ వినయ్ కుమార్, కట్టంగూరు మండల ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్, రైతులు వరికుప్పల రామరాజు, స్వామి, ముక్కమాల శ్రీను, మధు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ రక్షణకు దళిత బహుజనులు ఐక్యం కావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కృష్ణ తదితరులు

కేతేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రక్షణకు దళిత, బహుజనులు ఐక్యం కావాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించే సంగ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసే యత్నాలు చేస్తుందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు చేవెళ్ల డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు పెరిక మల్లయ్య, రవితేజ, స్టాలిన్, కె.లూదీస్, నామ మంగమ్మ, పాల్గొన్నారు.

అరకొర వసతుల మధ్య పశువైద్య కేంద్రాలు

వెంటాడుతున్న సిబ్బంది కొరత



పశువులకు రోగ నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్)

కనగల్, జూన్14: (ఆంధ్రజ్యోతి) పశువైద్యం దయనీయంగా మారింది. శిథిల భవనాలు, సిబ్బంది కొరతతో జిల్లా వ్యాప్తంగా పశువైద్య కేంద్రాలు నడుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 121 పశువైద్య శాలలుండగా సగానికి పైగా పశువైద్య కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. మరోపక్క పశు వైద్య కేంద్రాలను సిబ్బంది కొరత వేదిస్తోంది. ఒక్కో ఆసుపత్రికి పశు వైద్యాధికారి, ఓ అసిస్టెంట్, ఓఅటెండర్ అవసరం కాగా ఏళ్ల తరబడిగా పశు వైద్య శాఖలో నియామకాలు చేపట్టక పోవటంతో ఆయా పశువైద్యశాలల్లో 40 అసిస్టెంట్ పోస్టులు, 30 అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. కనగల్ మండలంలో రెండు పశువైద్య కేంద్రాలున్నాయి. వీటిలో ఒకటైన కనగల్ పశు వైద్య కేంద్రంలో సరైన వసతులు లేవు. వర్షాకాలంలో ఆసుపత్రి పైకప్పు జాలిచ్చి వర్షం నీరు కురుస్తోంది. అదనపు గది కొరత కారణంగా రికార్డులు సహా అన్ని రకాల వస్తువులు ఒకటే గదిలో భద్రపరుస్తుండటంతో ఆసుపత్రి ఇరుకుగా మారింది. చర్లగౌరారం గ్రామంలోని పశువైద్య కేంద్రంలో పశువైద్యాధికారి ఒక్కరే ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా ఓప్రైవేటు వ్యక్తిని అటెండర్‌గా నియమించుకుని పశువైద్య సేవలను కొనసాగిస్తున్నారు. రేగట్టె, జివడవల్లి గ్రామాల్లో నిర్మించనున్న పశువైద్యశాలలు (గోపాలమిత్ర భవనాలు) నిధుల కొరతతో మధ్యలోనే పనులను ఆపివేశారు. ప్రతీ 5 ఏళ్లకు ఓసారి జరిగే పశుగణన ఈఏడాది ఏప్రిల్ నెలలో అధికారులు నిర్వహించారు. ఆవులు, ఎద్దుల సంఖ్య గణనీయంగా తగ్గిందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

వ్యవసాయం యాంత్రీకరణ కావటంతో పశువుల వినియోగం తగ్గింది. మరోపక్క పశువులను సాకటం పోషించటం రైతులు భారంగా భావించటం తదితర కారణాలతో పశువుల సంఖ్య పడిపోయిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కనగల్ మండలంలో ఇటీవల జరిగిన సర్వే లెక్కల ప్రకారం ఆవులు 1800, గేదెలు 8,500, గొర్రెలు, మేకలు కలిపి 25 వేల వరకు ఉన్నట్టు సమాచారం. ఇలాగే కొనసాగితే పశుసంపద కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడవచ్చని పలువురు పేర్కొంటున్నారు. పశువైద్య శాఖలోని ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పశువైద్య కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

లింగయ్యకు పలువురు నాయకుల నివాళి


కనగల్, జూన్14: (ఆంధ్రజ్యోతి) మండలంలోని లింగాలగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఎంపళ్ల సైదులు తండ్రి లింగయ్య(70) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా లింగయ్య మృతదేహాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగల్ విండో చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్, ఎర్రమాద వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి నాయకులు శ్రీశైలం, సైదులు, జానయ్య బిక్షం, రాంబాబు ఉన్నారు.



లింగయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

1

ఆదివారం 15 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.4

ఎదురిల్లే.. ఊరే వేరు

- రెండు గ్రామాల మధ్యన సీసీ రోడ్డే సరిహద్దు
- నల్లా చార్జి ఒకరికి రూ.20, ఎదురింటి వారికి రూ.100

3

అప్పులపాలయ్యారు.. వలస పోయారు



పారా హుషార్

» తెల్ల జొన్నలకు పచ్చరంగు » జోరుగా కల్తీ జొన్నల విక్రయాలు

కల్తీకి కాదేది అనర్హం చందంగా ప్రస్తుతం అన్నీ కల్తీమయమయ్యాయి. ఇటీవలి వరకు ప్యాకింగ్ గూడ్స్, వండిన ఆహార పదార్థాలు లక్ష్యంగా కల్తీ లేదా నాసిరకానికి పాల్పడగా, తాజాగా ముడి ధాన్యాన్ని సైతం కల్తీ చేస్తున్న పరిస్థితి ఉంది. గతంలో పేదల ఆహారంగా పేరొందగా, ఇటీవల శరీరంలో షుగర్, కొలస్ట్రాల్ నియంత్రణ పేరుతో అంతా పచ్చ జొన్నలు గణనీయంగా వినియోగిస్తున్నారు. రొట్టె, గట్కా తదితర రూపాల్లో పచ్చ జొన్నలు తీంటున్నారు. దీంతో పచ్చజొన్నల విక్రయాలు క్రమేపీ పెరుగుతూ ధరల్లో నాణ్యమైన సన్నబియ్యంతో పోటీపడుతున్నాయి. దీంతో ఇదే అదనుగా పచ్చ జొన్నల కల్తీ ముఠాలు విజృంభిస్తున్నాయి. మార్కెట్లో అంతగా డిమాండ్ లేని, ధరలోనూ దిగదిడుపుగా ఉండే తెల్ల జొన్నలకు రంగు వేసి పచ్చ జొన్నలుగా మార్చి బహిరంగా మార్కెట్‌లో అసలు ధరతో విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

గల్లీ కిరాణం దుకాణం మొదలు మార్కెట్‌లోని హోల్‌సేల్ దుకాణాలు వరకు అన్నింటిలో రంగు వేసిన పచ్చ జొన్నలే లభిస్తున్నాయి. దీంతో వినియోగదారులు పచ్చ జొన్నల పేరుతో రంగు వేసిన తెల్లజొన్నలు తింటూ ఆరోగ్యానికి మరింత చేటు చేసుకుంటున్నారు. వాస్తవానికి తెల్లజొన్నలు తింటే ఆశించిన స్థాయిలో ఆరోగ్య ప్రయోజనాలు సమకూరనప్పటికీ ఆకలి బాధ తీరుతుంది. కానీ, పచ్చ జొన్నలుగా మార్చేందుకు తెల్ల జొన్నలకు కలుపుతున్న రసాయనాలతోనే పలువురి ఆరోగ్యానికి నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. కల్తీ జొన్నల వ్యవహారం జిల్లా కేంద్రం భువనగిరితోపాటు సుమారు ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు.

సాయంత్రం జొన్న రొట్టె రెడీ

ఆరోగ్యానికి మేలు చేస్తుందని పెరిగిన విశ్వాసంతో షుగర్, గుండె తదితర జబ్బులు ఉన్నవారు, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందు జాగ్రత్తగా పచ్చ జొన్న ఆహారం తీసుకునేవారి సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా అన్ని ప్రాంతాల్లో జొన్న రొట్టెల విక్రయాలు సుమారుగా అన్ని పట్టణాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో సాయంత్రం కాగానే వీధులు, చౌరస్తాల్లో పెరిగాయి. దీంతో ఇంటిలో పచ్చ జొన్న ఆహారాన్ని వండలేని వారు రెడీమేడ్ జొన్న రొట్టె, గట్కా, జావ తదితర ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తూ కడుపు నింపుకుంటున్నారు. అయితే..

మిగతా 2వ పేజీలో...

ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మరిన్ని రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించింది. మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు 72 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సామగ్రి ఉండగా,మరో 142 వేదికలకు ఈ సదుపాయాన్ని కల్పించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



ప్రతీ రైతు వేదికలో
రైతు నేస్తం

» మరో 142 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం
» రైతులకు సలహాలు, సూచనలకు పెద్దపీట
» ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మెళకువలు
» వ్యవసాయాన్ని పండుగ చేసేలా ప్రభుత్వ ప్రణాళిక

నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 32వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉండగా, తాజాగా మరో 62 రైతు వేదికల్లో సామగ్రి అందుబాటులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లాలో గతంలో 23 వేదికల్లో ఉండగా, ప్రస్తుతం 46 వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించారు. యాదాద్రి జిల్లాలో గతంలో 17 వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉండగా మరో 34 రైతు వేదికలకు పెంచడంతో రైతు నేస్తం కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయి. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతోపాటు వారికి వ్యవసాయంలో మెళకువలపై అవగాహన కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ నెలలోనే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా కూడా రైతుల ఖాతాలో జమ చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. అధికారులను పల్లె బాట పట్టించడంతోపాటు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలను నేరుగా వారికి తెలియజేసేందుకు రైతు వేదికలను వినియోగించుకోనుంది. వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని రానున్న రోజుల్లో మరిన్ని క్లస్టర్లకు పెంచే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలతో రైతులకు వ్యవసాయరంగంలో సాంకేతికతపై మరింత పరిజ్ఞానం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

పెరిగిన ప్రయోజనాలు..

రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రతీ వారం రైతులకు వివిధ పంటల సాగులో మెళకువలు ఇవ్వడం, శిక్షణ, అవగాహన కల్పించడం చేస్తున్నారు. అందుకు వ్యవసాయ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు బాధ్యతలు తీసుకుని వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు రైతు వేదికల్లో ఎల్‌సీడీ, వీడియో కెమెరాలు, సౌండ్ సిస్టం వంటి సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చారు. గతంలో నియోజవర్గానికి ఒక కేంద్రాన్ని ప్రారంభించగా, సత్ఫలితాలు వచ్చాయి. దీంతో మండలానికో వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఈ నేపథ్యంలో రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా, మరిన్ని రైతు వేదికలకు ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది. రాజేందర్‌నగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాలతో పాటు మిగతా వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో వివిధ పంటల సాగుపై రూపొందించిన వీడియోలను కూడా ప్రదర్శిస్తున్నారు. దీనికి తోడు శాస్త్రవేత్తలు వీడి యో కాన్ఫరెన్స్ సెంటర్‌ల ద్వారా ప్రతీ పంట సాగును, దానిలో యజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సవివరంగా చెబుతున్నారు. వీడియో కాన్ఫరెన్స్ సెంటర్లకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడటంతో పాటు వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు ఏర్పాటుచేయగా, ప్రభుత్వం మండలాలకు వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి ప్రస్తుతం..

మిగతా 2వ పేజీలో...

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ నెల 16న నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మరిన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని ప్రారంభిస్తున్నాం. మండలస్థాయిలో అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ, మండల విద్యాధికారులు అందుబాటులో ఉండాలి. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు కావాలి. సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలి. పంటలలో ఆధునిక మెళకువలు, నూతన సాంకేతిక విధానాలపై శాస్త్రవేత్తలు, అధికారులు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను రైతు వేదికల ద్వారా తెలియజేయడం జరుగుతుంది. రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు పెద్ద సంఖ్యలో వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

- ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్

జాతీయ లోక్‌అదాలత్‌కు విశేషస్పందన



లోక్‌అదాలత్‌లో రాజీపత్రాన్ని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేషస్పందన లభించింది. లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 12 బెంచిలు ఏర్పాటు చేయగా 38 సివిల్ కేసులు, 15,837 క్రిమినల్, 85 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 28 బ్యాంక్ కేసులు, 25 సైబర్ క్రైమ్ కేసులు, 30 ట్రాన్స్‌కో, 5,567 ట్రాఫిక్ చలానా కేసులు, మొత్తం 21,660 కేసులు పరిష్కరించారు. ప్రమాద బీమా కేసుల్లో రూ.4,75,29,000 నష్టపరిహారం ఇప్పించగా, బ్యాంక్ కేసుల్లో రూ.30,21112 రుణ పరిహారం ఇప్పించారు. అదేవిదంగా సైబర్ క్రైమ్ కేసుల్లో రికవరీ డబ్బు రూ.2,03,112 బాధితులకు ఇప్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పి.పురుషోత్తంరావు, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కట్ట అనంతరెడ్డి, మంద నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

నల్లగొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు అన్నారు. శనివారం బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో మిగతా రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొని బీసీలు రాజకీయ పార్టీ స్థాపించి రాజ్యాధికారంలోకి రావాలని, రాజ్యాధికారమే నిజమైన ఆత్మగౌరవమని అన్నారు. బీహార్‌లో యాదవులు, కురుమలు రాజకీయ పార్టీలు స్థాపించారని, తమిళనాడులో డీఎంకె, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ స్థాపించి రాజ్యాధికారం సాధించాయని తెలిపారు. తమిళనాడులో బీసీలు పరిపాలిస్తుండటం వల్లే ఆ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తప్ప బీసీలు అన్నిచోట్ల అధికారంలో కొనసాగుతున్నారన్నారు. పశ్చిమబెంగాల్‌లో బ్రాహ్మణుల పరిపాలన వల్లే ఆ రాష్ట్రం ఇప్పటివరకు అభివృద్ధి సాధించలేదన్నారు. అగ్రకులాలు చేసే ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ, బీసీల ఆత్మాభిమాన ఉద్యమంలో మాత్రం వెనకబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక జనాభా ఉన్న బీసీల నుంచి తక్కువ శాతం ఎమ్మెల్యేలు ఎన్నికవుతున్నారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే బీసీలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు. రిటైర్డ్ పీఎస్ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, బీసీలు రాజకీయ పరిజ్ఞానం పెంచుకొని రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ, బీసీలు ఉద్యమ చైతన్యంతో పోరాటాలు విస్తృతం చేయాలన్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యుడు పాలకూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్, చామకూర రాజు, కేవీ.గౌడ్, చెన్నా శ్రీకాంత్, కొండల్ గౌడ్ అవ్వరు వేణు, తరాల పరమేష్ యాదవ్, సమీర్‌కుమార్, నకరికంటి కాశయ్య, పందుల సైదులు, రామరాజు, శంకర్‌గౌడ్,మల్లయ్య ముదిరాజ్, కృష్ణ కౌండిన్య, తదితరులు పాల్గొన్నారు.

21న జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన!



నల్లగొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 21న నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నట్టు సమాచారం. నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి(సాగర్) మండలంలో భూభారతి అమలు తీరును పరిశీలించడంతోపాటు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్న ట్టు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన పర్యటన, కార్యక్రమాలు అధికారికంగా ఖరారుకానున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాం గం ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న నేపథ్యంలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ ప్రజలకు, రైతులకు చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి భూభారతి అమలు తీరును పరిశీలించనున్నట్టు సమాచారం.

హోటళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండటౌన్,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల వెంట ఉన్న హోటళ్లు,దాబాలు, రెస్టారెంట్ల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడమేగాక, హైవేలపై హోటళ్లు, దాబాలు వద్ద ప్రమాదాలు జరగకుండా నివారణా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా హోటళ్ల వద్ద వాహనాలు నిలిపే, బయల్దేరే సమయంలో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు సరైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హోటళ్ల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పోయే వాహనదారుల వివరాలు తీసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ప్రతీ రోజు అందజేయాలన్నారు. మద్యం, గంజాయి విక్రయించడం, వినియోగించడం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా ఇతర ప్రాంతాల నుంచి మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకొచ్చి వినియోగిస్తుంటే సమీప పోలీస్‌స్టేషన్‌కుగానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ఎస్‌బీ సీఐ రాము, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు సరికాదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు గతంలో ఒకసారి కేటీఆర్‌ను సుదీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయారని అన్నారు. ఫార్ములా ఈ-రేస్ సజావుగా సాగిందని, అందులో ఎలాంటి అక్రమాలు లేకున్నా కేటీఆర్‌ను విచారించడం సరైన విధానంకాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకూ పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నల్లగొండ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డికొమరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, వారి లాభాల కోసమే ప్రభుత్వరంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తోందని ఆరోపించారు. బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఇవి అమలైతే కార్మికులు బానిసలుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె మోదీ ప్రభుత్వానికి గుణపాఠం అవుతుందని హెచ్చరించారు. సమ్మె విజయవంతానికి జిల్లాలో ఈ నెల 15 నుంచి 20 వరకు యూనియన్ సమావేశాలు నిర్వహించి అధికారులకు సమ్మె నోటీసులు అందజేయాలన్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశాలు నిర్వహించి కార్మికుల్లో సమ్మె స్ఫూర్తిని నింపాలన్నారు. జూలై మొదటి వారంలో సమ్మె జయప్రదం చేయాలని కరపత్రాల పంపిణీ, బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. జూలై 9న ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు డబ్బికారు మల్లేష్, ప్రమీల, ఎండి.సలీం, అవుత సైదులు, దండెంపల్లి సత్తయ్య, గౌతమ్‌రెడ్డి, చింతపల్లి బయన్న, తదితరులు పాల్గొన్నారు.

21న యోగా దినోత్సవం



యోగా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ కల్చరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21వ ఉదయం 9గంటలకు స్థానిక ఎంవీఆర్ స్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్టు భారత్ స్వామిభిమాన్ ట్రస్ట్, యోగా ఉత్సవ సమితి అధ్యక్షుడు నాగులపల్లి శ్యాంసుందర్, కార్యదర్శి జల్లెల్లి వెంకటేశ్ యాదవ్ తెలిపారు. శనివారం యోగా దినోత్సవం కరపత్రాన్ని జిల్లా న్యాయాధికారి ఎం.నాగరాజు ఆవిష్కరించారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు, యువకులు, విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువులు కరుణాకర్, పున్న వెంకటేశ్వర్లు, కోట్ల సైదులు, డీఎస్పీ శివరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చండంపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుంటోజు వినోదాచారి అన్నారు. మండలంలోని పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పార్టీ మండల కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా నాగిళ్ల రాములు, శ్రీరామదాసు సతీష్‌చారి, బచ్చనబోయిన వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, కోశాధికారి ఆంజనేయులు, యువమోర్చా, ఓబీసీమోర్చా, ఎస్సీ మోర్చా, ఎస్టీమోర్చా, కిసాన్‌మోర్చా నాయకులను ప్రకటించారు.

స్టాఫ్‌నర్స్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని ఎస్సీ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో స్టాఫ్ నర్స్ పోస్ట్‌కు దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు స్టాఫ్ నర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు బైపాస్ రోడ్‌లోని గురుకుల కళాశాల(పాత వాసవీ జూనియర్ కళాశాల)లో సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

● దేవరకొండ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత



దేవరకొండ లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని దేవరకొండ మునిసిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. దేవరకొండ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు ఈ సందర్భంగా అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో 4 సివిల్ కేసులు, 94 క్రిమినల్ కేసులు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 3 సివిల్ కేసులు, 45 క్రిమినల్ కేసులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 3 సివిల్ కేసులు, 36 ఇతర కేసులు, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 10,170 డ్రంకెన్ డ్రైవ్‌తోపాటు ఇతర కేసులు పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. లోక్‌అదాలత్ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌బాబు, ఏపీజీ నెమికంటి రమాశంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, నెమికంటి గౌరిశంకర్, గాజుల ఆంజనేయులు, వనం జగదీశ్వర్, దేవరకొండ సీఐ నర్సింహులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి


మిర్యాలగూడలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి వేణు

మిర్యాలగూడ లీగల్ : లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా జడ్జి జి.వేణు అన్నారు. మిర్యాలగూడ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆస్తి కోసం అన్నదమ్ములు, చిన్నచిన్న తగాదాలతో భార్యభర్తలు కోర్టుల చుట్టు తిరుగుతూ బంధాలు, అనుబంధాలకు తిలోదకాలు ఇస్తూ, కేసులతో కోర్టుల చుట్టు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ కోర్టులల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 194 కేసులను పరిష్కరించినట్లు 5వ అదనపు జిల్లా జడ్జి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి పి.సుజయ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, స్పెషల్ మెజిస్ట్రేట్ శ్రీదేవి తెలిపారు. ఐదవ అదనపు జిల్లా కోర్టులో 4 మోటార్ యాక్సిడెంట్ కేసులను పరిష్కరించడం ద్వారా బాధితులకు రూ. 21,10,000 నష్ట పరిహారం ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా వారికి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, ఏజీపీ గోదల వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయాలి


తీన్మార్ మల్లన్నను కలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు

చింతపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సైనిక్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు నందుపట్ల రామ్‌సాగర్ మాట్లాడుతూ..విద్యార్థులకు నాయకత్వ లక్షణాలతో పాటు దేశభక్తిని పెంపొదించడానికి పాఠశాలలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై త్వరలోనే తగిన ప్రణాళిక సిద్ధం చేసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తగిన కృషి చేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఐలయ్య, మహేందర్, నందుపట్ల లక్ష్మణ్ సాగర్, సైనిక్ స్కైల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమ్మానాన్న ఫౌండేషన్ సేవలు అభినందనీయం

నిడమనూరు,జూన్14(ఆంధ్రజ్యోతి): అమ్మనాన్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. శుక్రవారం రాత్రి నిడమనూరు మండలం బంకాపురంలోమజ్జిగ పంపిణీ చేసిన దాతలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మంచి లక్ష్యంతో ఫౌండేషన్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. అలాగే బంకాపురం గ్రామానికి చెందిన బాలికలు నిడమనూరు మోడల్ స్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన బండారు పూజిత, హైస్కూల్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన బూడిద కీర్తన, గురుకుల కళాశాలలో ఇంటర్‌లో 980 మార్కులు సాధించిన బుషి పావనీలకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహం అందజేశారు. మజ్జిగ పంపిణీ చేసిన దివ్యాంగుడికి ఉపాధి చూపి అతడికి పారితోషికం అందజేశారు. అనంతరం మజ్జిగ పంపిణీ దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ, పేరయ్య పాల్గొన్నారు.

సైదులుకు ఎమ్మెల్సీ నివాళి


సైదులుమృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

వేములపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్న బొస్క చిన సైదులు గుండెపోటుతో చెందారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ శనివారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావు ఎల్లారెడ్డి, నాయకులు రేగట్టె రవీందర్‌రెడ్డి, పుట్టల కృపయ్య, గంజి శ్రీనివాస్, పుట్టల శ్రీను, తంగెళ్ల సత్తిరెడ్డి, కొమ్ము వెంకన్నవినోద్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందించాలి

సమగ్ర శిక్ష ఉద్యోగి బొస్క సైదులు కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని సమగ్ర శిక్ష నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించడంతోపాటు ఉద్యోగ భద్రతను అందించాలని కోరారు.


ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టిన అనంతరం పొలం


లింగయ్య పొలంలో పెరిగిన చెట్లు

సాగుకు సన్నద్ధంగా..

- ఉపాధి హామీ పథకం కింద రైతు పొలంలో కంపచెట్లు తొలగింపు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతు

పెద్దవూర మండల కేంద్రానికి చెందిన బొడ్డ లింగయ్య చెందిన రెండు ఎకరాల భూమిలో కొన్నేళ్లుగా సాగు చేయకపోవడంతో అడవిని తలపించేలా చెట్లు పెరిగాయి. దీంతో సదరు రైతు తన భూమిలో పెరిగిన చెట్లు తొలగించాలని ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. స్పందించిన ఈసీ కొండయ్య, టెక్నికల్ అసిస్టెంట్ అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఊర శ్రీను, మేటి శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో 50 మంది కూలీలతో రెండు వారాలపాటు ఉపాధి హామీ పనులను నిర్వహించి సాగుకు అను కూలంగా మార్చారు. అతి తక్కువ కాల వ్యవధిలో చెట్లను తొలగించి, మొద్దులను తీసి తనకు తన పొలం సేద్యం చేసుకోవడానికి అందించిన ఉపాధి హామీ కూలీలు, అధికారులకు రైతు లింగయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో కార్య కమంలో కర్నాటి వెంకటరెడ్డి, రమేష్, జోగు కోటేష్, జోగు రాజు, కర్నాటి శ్రీరామ్‌రెడ్డి, పి.జైపాల్‌రెడ్డి, పుష్పలత, పద్మ, రాజేశ్వరి, సాంబ య్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

- (ఆంధ్రజ్యోతి- పెద్దవూర)

సాగర్ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో రక్తం ఇస్తున్న యువకులు

నాగార్జునసాగర్,జూన్14(ఆంధ్రజ్యోతి):ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా సాగర్ హిల్‌కాలనీలో కమలా నెహ్రూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహారాజుల సేవా సంఘం ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 22 మంది యువకు లు రక్త దాన చేసినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎంవో డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పృథ్వి, నర్సింగ్ సూపరిటెండెంట్ పలీనా, పద్మావతి, మహారాజుల సేవా సంఘం నాయకులు బద్రి, పుల్లారావు, నకుల్‌రావు, వీరబాబు, రాందాసు, సిబ్బంది రాజు, దుర్గయ్య, సరిత, లీనా, ప్రియ, మధు, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

హాలియా,జూన్14(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణ కేంద్రంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న నవోదయ కోచింగ్ సెంటర్‌పై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. శనివారం హాలియాలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నవోదయ గురుకుల సైనిక్ కోచింగ్ సెంటర్ పేరుతో హాస్టల్ సౌకర్యం కలదు అంటూ అడ్మిషన్ తీసుకుంటానికి వీలు లేదని ప్రజలు కూడా ప్రభుత్వ అనుమతి లేనటువంటి కోచింగ్ సెంటర్‌లకు పిల్లలను పంపి నష్టపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, వర్షిత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం కార్యవర్గ సమావేశం


హాలియా సమావేశంలో పాల్గొన్న స్వర్ణకారుల సంఘం సభ్యులు

హాలియా, జూన్14(ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల సంఘం నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని హాలియా మునిసిపాలిటీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల పట్టణాల స్వర్ణకార సంస్థ సభ్యులు తమ సమస్యలపై చర్చించారు. కార్పొరేట్ జ్యూవెల్లరీ దుకాణాల్లో పట్టణ స్థాయిలో ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న స్వర్ణకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈమధ్యకాలంలో పనులు లేక స్వర్ణకారులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని ప్రభుత్వానికి వినతి పత్రం అందజేయాలని తీర్మాణం చేశారు. అలాగే జిల్లా స్వర్ణకార సభ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి కొన్ని తీర్మాణాలను చేశారు. కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి గోవర్ధనాచారి, కోశాధికారి కటకం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ విఠలాచారి, గొట్టిముక్కల చంద్రశేఖర్, కూరెళ్లమదనాచారి, కన్నెకంటి సత్యానారాయణచారి, కటకం మురళిచారి, పల్లెం ప్రశాంత్‌రెడ్డి, వంగాల శివకుమార్, మద్దోజు బ్రహ్మచారి, కటకటం శంభాయాచారి, గుండా రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు, వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిడమనూరులో తిరంగా ర్యాలీ


నిడమనూరులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు యువకులు

నిడమనూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడాన్ని హర్షిస్తూ నిడమనూరు మండల కేంద్రంలో శనివారం రాత్రి తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి రామాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని భారత్‌కు అనుకూలంగా, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడుతూ పాకిస్థాన్ కుట్రను మన దేశం సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. కార్యక్రమంలో చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, ఎదుళ్ల వినీల్‌రెడ్డి, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, కడియం సైదులు, నల్లబోతు వెంకటేశ్వర్లు, కేఎస్ఎన్ రాజు, చాపల వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, తెల్కపల్లి శంకర్, పసుపులేటి మహేష్, జాజం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సైదులుగౌడ్

మిర్యాలగూడ టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. శనివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న విద్యార్థులు అరకొర వసతులతో ఇ బ్బంది పడుతుండగా, సంక్షేమ వసతి గృహాల్లో నివసించే విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారన్నారు. ఆయా హాస్టళ్లలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు చేయకపోగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఏళ్ల తరబడి అందించకపోవడం సరికాదన్నారు. విడతల వారీగా బకాయిలు విడుదల చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలేమీ తీసుకోవడం లేదన్నారు. బకాయిలుండటంతో డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా యూనివర్సిటీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానురీతిన నిబంధనలు ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘ నా యకులు కర్నాటి శివరామకృష్ణ, సరికొండ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పాలన విస్మరించిన పాలకులు : సీపీఎం



మిర్యాలగూడలో డ్రైనేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాలకులు పరిపాలన విస్మరించారని సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి శనివారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎక్కడ చూసినా మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తుండగా, దోమలు, పందలు వ్యాప్తి పెరిగిందన్నారు. కోదాడ-జడ్చర్ల రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ బస్టాండు, శరత్‌బాబు హాస్పటల్, అంబేద్కర్ విగ్రహాల వద్ద మురుగు నీటితో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందన్నారు. కార్యాచరణ పేరుతో ప్రచారం తప్ప పాలకులు చేస్తున్నదేమీ లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బావండ్ల పాండు, మూడావత్ రవినాయక్, అయూబ్‌ఖాన్, పరశురాములు, పాపిరెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలి

తిరుమలగిరి(సాగర్): నకిలీ విత్తనాలను అమాయక రైతులకు విక్రయిస్తున్న దళారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు వేములకొండ పుల్లయ్య అన్నారు. శనివారం ఆయన మండలంలోని రాజవరం గ్రామంలో సీపీఎం నాయకులు, రైతులతో కలి ిస మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రా ప్రాంతాల నుంచి తండాలు, గ్రామాలకు పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు. అయితే అధికారులు ఈ దందాను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం నాయకులు షేక్ చాంద్‌పాషా, బుర్రి సైదయ్య, దండె లింగయ్య, మున్ననూని రంగయ్య, పార్వతమ్మ, మేకల సైదులు, శంకరయ్య, వెంకన్న, లింగయ్య, నాగయ్య, శ్రీనయ్య, ఇద్దయ్య, రామయ్య పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

చింతపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి):పెంచిన బస్‌పాస్ చార్జిలను వెంటనే తగ్గించాలని బీజేపీ మండల కౌన్సిల్ సభ్యుడు శివర్ల రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం చింతపల్లిలో ఆయన మాట్లాడారు. పెంచిన చార్జిలపై ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు.

● దేవరకొండ :బస్‌పాస్ ధరల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బీఆర్ఎస్‌వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్‌పాస్ ధరలను పెంచి పేద విద్యార్థులపై అధిక భారం మోపినందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అట్టి ఆలోచనను విరమించుకోవాలన్నారు.

సీనియర్ న్యాయవాది రామారావు మృతి



దేవరకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిఫ్ కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న వీవీ రామారావు(60) గుండెపోటుతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. రామారావు న్యాయవాదిగా, దేవరకొండ ఖిల్లా అభివృద్ధి కమిటి సభ్యుడిగా తెలంగాణ సాహితీ సాంస్కృతిక వేదిక నాయకుడిగా రామారావు సేవలు అందించారు. రామారావు మృతికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బ్రాహ్మణసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డిఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బ్రాహ్మణసంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ, వైద్యుల కృష్ణమూర్తి, సీనియర్ న్యాయవాదులు నెమికంటి గౌరిశంకర్, రమాశంకర్‌తోపాటు పలువురు న్యాయవాదులు, సంతాపం ప్రకటించారు.

మండలంలో సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పేరుకపోయిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ 8వ మండల మహాసభ కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని, స్థానిక కర్మాగారాల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ పవర్‌ప్లాంట్ ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించాలన్నారు. కార్యక్రమంలో ధనావత్ శాంతి, పోలేపల్లి ఉదయ్, పేరుపొంగు లక్ష్మయ్య, వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

పెద్దవూర, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కట్టంగూర్‌లో ఈనెల 22, 23న నిర్వహించే కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను కోరారు. శనివారం మండల కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో దొంతాల నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, దుబ్బ పరమేష్, చుక్కా రమేష్, తరి రామకృష్ణ, ఊరే ప్రభాకర్, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీ, వాసవీ వనితా క్లబ్ సేవలు అభినందనీయం

దేవరకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండ వాసవీ, వనితాక్లబ్ పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని వాసవీక్లబ్ జిల్లా ఇన్‌చార్జి కొండూరు శోభన్‌బాబు అన్నారు. శనివారం దేవరకొండలో వాసవి, వాసవీవనితాక్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ సేవా కార్యక్రమాలు వాసవీ క్లబ్ నిర్వాహకులు మిర్యాల చంద్రమౌళి, శోభన్‌బాబు పాల్గొని మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో స్వాగత బోర్డులు ఏర్పాటు, దివ్యాంగులకు కిట్లు, చెప్పులు కుట్టేవారికి గొడుగులు పంపిణీ, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు బెలిదె మాధవి, బచ్చు సతీష్, మహేష్, నీల సంజీవకుమార్, ఆలంపల్లి పద్మ, అద్దం రమేష్, మహాలక్ష్మీ, భాగ్యమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.



గొడుగులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు కొండూరు శోభన్‌బాబు, చంద్రమౌళి

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : భైరవం / వెంకటేశ్వర: థగ్ లైఫ్ / రాఘవ: బద్మాషులు, శ్రీశ్రీశ్రీ రాజావారు / విట్రోస్: థగ్‌లైఫ్, భైరవం, దేవరకొండ : మనోజ్ : భైరవం / మైత్రి వెంకటేశ్వర : కరాటే కిడ్